



● పల్నాడులో వరి పొలాలు

బంధిఖానాలో.. బాల్యం



ఆట పాటలు.. కేరింతలు.. తుళ్లింతలు.. గిల్లికజ్జాలు.. అందమైన ఊహలు.. ఇలా ఎన్నో మధురానుభూతుల్లో సాగాల్సిన బాల్యం వివాహ బంధంలో బందీగా మారిపోతోంది. అనాదిగా సమాజాన్ని పట్టి పీడిస్తున్న దురాచారాల్లో బాల్య వివాహం కూడా ఒకటి. 150 ఏళ్ల క్రితం 1872లోనే బాల్య వివాహాలను రద్దు చేస్తూ అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం చట్టం చేసినా అది నేటికీ సమాజాన్ని వీడటం లేదు. ఫలితంగా ముక్కుపచ్చలారని ఎంతో మంది చిన్నారుల జీవితాలు మూడు ముళ్ల బంధంలో చిక్కి శల్యమవుతున్నాయి. బాల్య వివాహాల సంఖ్య ఇటీవల కాలంలో భారీగా పెరుగుతుండడం సమాజాన్ని ఆందోళనకు గురిచేస్తోంది. కొవిడ్ అనంతర కాలంలో ఈ సంఖ్య గణనీయంగా పెరిగిందని గణాంకాలు చెబుతున్నాయి.

- పల్లెల కంటే.. పట్టణాల్లో అధికంగా చిన్నారి పెళ్లి కూతుళ్లు..
- బాల్య వివాహాల్లో రాష్ట్ర సగటు దాటిన ఉమ్మడి గుంటూరు
- 35.4 శాతంతో రాష్ట్రంలో నాలుగో స్థానం
- కోవిడ్ అనంతరం ఆందోళనకరంగా పెరుగుదల

\- నరసరావుపేట

నాలుగో స్థానంలో ఉమ్మడి జిల్లా..

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే లెక్కల ప్రకారం ఉమ్మడి గుంటూరు జిల్లాలో 2019- 20లో 35.4 శాతం బాల్య వివాహాలు జరిగాయి. ఇది రాష్ట్ర సగటు 29.3 శాతం కంటే 6 శాతం అధికం. కోవిడ్ అనంతర కాలంలో ఈ సంఖ్య మరింత పెరిగింది. జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అడ్డుకుంటున్న కేసుల సంఖ్య ఏటికేడాది పెరగడమే ఇందుకు నిదర్శనం. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 2018లో 31 బాల్య వివాహాలను ఐసీడీఎస్ అధికారులు అడ్డుకోగా.. ఆ సంఖ్య 2019 నాటికి 23కు తగ్గింది. అయితే కొవిడ్ ప్రభావం మొదలైన 2020లో 34, 2021లో 37 వివాహాలను అధికారులు అడ్డుకున్నారు. ఆ ఏడాది తొలి నాలుగు నెలల్లోనే 12 బాల్య వివాహాలను అడ్డుకున్నారు.

8 లో..



పనిచేయని చట్టాలు

బాల్య వివాహాల రద్దు కోసం ప్రభుత్వం అనేక చట్టాలు చేస్తోంది. బ్రిటీష్ పాలనలోనే పలు చట్టాలు జరిగాయి. 1872లో అప్పటి గవర్నర్ జనరల్ మేయో తొలిసారి బాల్య వివాహ రద్దు చట్టం చేశారు. ఆ తరువాత 1929లో లార్డ్ ఇర్విన్ కాలంలో 'శారద' చట్టం చేశారు. ప్రొహిబిషన్ ఆఫ్ చైల్డ్ మ్యారేజెస్ యాక్ట్-2006ను చేశారు. ఈ చట్టం ప్రకారం ఆడపిల్లల వివాహ వయసు 18, మగపిల్లల వివాహ వయసు 21గా నిర్ణయించారు. కిందటేడాది ఈ చట్టాన్ని సవరించి ఇద్దరి వయసును 21 ఏళ్లకు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

సిరుల వరి



ఖరీఫ్ వరి సాగు కళకళలాడుతోంది. అన్నదాతలు అంచనాలకు మించి వరి సేద్యం చేశారు. గతేడాది కంటే సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. గత ఖరీఫ్, రబీ సీజన్‌లలో ధాన్యం దిగుబడులు ఆశాజనకంగా ఉండటంతో రైతులు వరి సాగు వైపు మొగ్గు చూపారు. మిరప సాగు చేసే రైతులు కూడా ఈ సారి వరి సాగు చేపట్టారు. వరినాట్లు చివరి దశకు చేరుకున్నాయి. ఈ వారంలో పూర్తవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. నాగార్జునసాగర్.. కృష్ణా డెల్టా ఆయకట్టు పరిధి పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 5.31 లక్షల ఎకరాల్లో వరి సాగైంది.

అంచనాలకు మించి వరి సేద్యం

- ఖరీఫ్ కళకళ.. 5.31 లక్షల ఎకరాల్లో సాగు
- అనుకూలించిన పరిస్థితులు
- పల్నాడు జిల్లాలో 43 వేల ఎకరాలు అధికం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

సాగర్.. కృష్ణా డెల్టా ఆయకట్టు ప్రాంతాలు ధాన్యాగారంగా పేరొందాయి. ఖరీఫ్‌లో వరి సాగు పెరగడంతోనే యూరియా సమస్యలు తలెత్తుతున్నాయి. గతేడాది సాగు అంచనాలతో యూరియా సరఫరా చేయడంతో.. కొరత ఏర్పడుతోంది. పల్నాడు జిల్లాలో వరి సాధారణ సాగు విస్తీర్ణం 96,498 ఎకరాలు కాగా 1,29,630 ఎకరాల్లో ఇప్పటికి వరి సాగైంది. గతేడాది 85,990 ఎకరాల్లో వరి పండించారు. క్రితం సారి కంటే 43,640 ఎకరాల్లో వరి సాగు పెరగడం గమనార్హం. ఇంకా మూడు నుంచి నాలుగు వేల ఎకరాల్లో వరినాట్లు వేసే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది.

● గుంటూరు జిల్లాలో సాధారణ వరి సాగు విస్తీర్ణం 1,53,143 ఎకరాలు కాగా 1,53,868 ఎకరాల్లో ఇప్పటికే వరి సాగైంది. మరో రెండు నుంచి మూడు వేల ఎకరాల్లో వరినాట్లు వేసే అవకాశం ఉంది. గతేడాది 1,40,935 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఈ ఏడాది 12,933 ఎకరాలు వరి సాగు అధికం. ఈ ఏడాది ఖరీఫ్ ధాన్యం దిగుబడులు కూడా పెద్ద ఎత్తున పెరగనున్నాయి. ప్రభుత్వం వరి దిగుబడులను ముందుగానే అంచనా వేసి ఇందుకు తగ్గట్టుగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ దిశగా పౌరసరఫరాల శాఖ చర్యలు చేట్టాలి.

● బాపట్ల జిల్లాలో వరి ప్రధానంగా సాగు చేస్తారు. ఈ జిల్లాలో కృష్ణా డెల్టా.. సాగర్ ఆయకట్టులు ఉన్నాయి. వరి సాధారణ సాగు విస్తీర్ణం 2,47,245 ఎకరాలు కాగా ఇప్పటికే 2,48,193 ఎకరాల్లో సాగైంది. సాగర్ ఆయకట్టులో చివరి భూముల్లో వరి నాట్లు ఇంకా జరుగుతున్నాయి. ఇంకో ఐదు వేల ఎకరాల్లో వరి నాట్లు వేసే అవకాశం ఉంది. గతేడాది సాగు విస్తీర్ణం చూస్తే 2,20,903 ఎకరాలు కాగా.. ఈ ఏడాది 27,290 ఎకరాలు అధికం.

నాలుగేళ్లలో వరి సాగు ఎకరాల్లో..

జిల్లా	2022	2023	2024	2025
పల్నాడు	92,773	27,675	85,990	1,29,630
బాపట్ల	2,42,755	2,13,383	2,20,903	2,48,193
గుంటూరు	1,54,895	1,39,005	1,45,935	1,53,935

నిర్మాణం.. నత్తనడకన

- సా..గుతున్న ఇంటిగ్రేటెడ్ ల్యాబొరేటరి పనులు
- 2021లో కేంద్ర ప్రభుత్వం రూ.1.25 కోట్లు విడుదల



నరసరావుపేట ఆస్పత్రిలో ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబొరేటరీ భవనం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నరసరావుపేట ప్రభుత్వ ఆస్పత్రిలో 2021 నుంచి ఇంటిగ్రేటెడ్ ల్యాబరేటరీ నిర్మాణాన్ని సాగదీస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ల్యాబ్ ఏర్పాటుకు రూ.1.25 కోట్లు విడుదల చేసింది. అయితే బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగు తుండటంతో కాంట్రాక్టర్ మొక్కుబడిగా పనులు నిర్వహిస్తున్నారు. పనులు జరుగుతున్న తీరును పరిశీలిస్తే ఇప్పట్లో ల్యాబ్ రోగులకు అందుబాటులోకి వచ్చే పరిస్థితులు కానరావడంలేదు. ల్యాబ్ నిర్మాణం పూర్తి చేస్తే రక్తం.. యూరిన్.. తదితర పరీక్షలు అందుబాటులోకి వస్తాయి తద్వారా పేదలకు ఆర్థిక భారం తప్పుతుంది. ఈ పరిస్థితుల్లో ఉన్నతాధికారులు ల్యాబొరేటరీ నిర్మాణ పనులపై దృష్టి సారించాలని రోగులు కోరుతున్నారు.

మాచర్ల ఆస్పత్రికి.. మహర్దశ

వంద పడకలుగా అప్‌గ్రేడ్‌కు సీఎం హామీ

- అందుబాటులోకి రానున్న అత్యవసర వైద్య సేవలు



మాచర్ల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మాచర్లలో ప్రభుత్వ ఆస్పత్రి ఉన్నా.. అత్యవసర వైద్యం అందక బాధితులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాద సమయాల్లో అత్యవసర వైద్య సేవలు అందక నరసరావుపేటో లేదంటే సుదూరంగా ఉన్న గుంటూరుకో పరుగులు పెట్టాల్సి వచ్చేది. ఈ క్రమంలో ఎందరో మృతి చెందుతున్నారు. మాచర్లతో పాటు గురజాల, యర్రగొండపాలెం, మార్కాపురం, నాగార్జున సాగర్ ప్రజలకు అత్యవసర వైద్యం కోసం మాచర్ల ప్రభుత్వ ఆస్పత్రిని ఆశ్రయిస్తుంటారు. అయితే ఆ స్థాయిలో ఇక్కడ సరైన వసతులు, సౌకర్యాలు, ఆధునిక వైద్యం అందుబాటులో లేక మూడు దశాబ్దాలుగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితిని గమనించిన ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి వినతితో ఇటీవల మాచర్ల పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభు త్వాస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తామని హామీ ఇచ్చారు. సీఎం హామీ అమలైతే మాచర్ల ప్రభుత్వ ఆస్పత్రికి మహర్దశ పట్టినట్లే. నాలుగు నియోజకవర్గాల ప్రజలకు లైఫ్‌లైన్‌గా ఉన్న మాచర్ల ప్రభుత్వాస్పత్రి వంద పడకలుగా అప్‌గ్రేడ్ అయితే అన్ని రకాల అత్యవసర వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి. అటు నరసరావుపేట లేదంటే ఇటు 150 కి.మీ. దూరంలో ఉన్న గుంటూరుకు పరుగులు పెట్టాల్సిన దుస్థితి నుంచి విముక్తి లభించనున్నది. ప్రస్తుతం యాభై పడకలుగా ఉన్న ఆస్పత్రి వంద పడకలుగా అప్‌గ్రేడ్ అయితే ఆధునిక ఆపరేషన్ థియేటర్లు, ఇంటెన్సివ్‌కేర్, అడ్వాన్స్ ఆర్టిఫిషియల్ ఆక్సిజన్ పరికరాలు, రక్త పరీక్షల ల్యాబ్, సీటీ స్కానింగ్, బ్లడ్ బ్యాంకు వంటి అనేక వసతులతో కూడిన విభాగాలు రోగులకు అందుబాటులోకి వస్తాయి. అన్ని విభాగాల్లో దాదాపు 25 మంది సివిల్ సర్జన్లు, 30 మంది వైద్య గ్రేడ్ 2 సిబ్బంది, నర్సింగ్ స్టాఫ్, రేడియాలజిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్స్ ఇలా సుమారు 150 మంది సేవలు అందిస్తారు. వెనుకబడిన మాచర్ల ప్రాంత ప్రజలకు ఆరోగ్య ప్రదాయినిగా 100 పడకల ప్రభుత్వాస్పత్రి నిలుస్తోందని ఎమ్మెల్యే విశ్వసిస్తున్నారు.



ప్రభుత్వ వైద్యశాలలో బారులు తీరిన రోగులు

అమరేశ్వరునికి లక్ష పుష్పార్చన



అమరావతి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వరాలయంలో స్వామివారి మూలవిరాట్‌కు గురువారం లక్ష పుష్పార్చన జరిగింది. దాతల సహకారంతో అర్చకులు స్వామివారికి పుష్పార్చన చేశారు. కార్యక్రమంలో ఈఓ రేఖతో పాటు భక్తులు పాల్గొన్నారు.

ఆలయ భూముల ఆక్రమణ

సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం కబ్జాలో బ్రాహ్మణ మాన్యాలు

- వేణుగోపాలస్వామి భూముల్లో గోడౌన్లు

దాచేపల్లి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): అధికారం అండ ఉంటే ఏదైనా చేసుకోవచ్చు అన్నట్లుగా ఏకంగా మండలంలోని పెదగార్లపాడులో శ్రీవేణుగోపాల స్వామి ఆలయ భూములను కూడా ఆక్రమించేశారు. వైసీపీ హయాంలో అప్పటి పాలకుల అండతో పలువురు భూ ఆక్రమణలకు పాల్పడ్డారు. ఇదే రీతిలో సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం కూడా వేణుగోపాలస్వామికి గతంలో ఎప్పుడో ధూప దీప నైవేద్యాల కోసం భక్తులు ఇచ్చిన భూములను ఆక్రమించేసింది. పెదగార్లపాడులో శ్రీవేణుగోపాలస్వామికి 933 సర్వే నెంబరులో 105.76 ఎకరాలు భూములు ఉన్నాయి. ఆ భూముల్లో కోట్ల రూపాయల భూగర్భ గనులు ఉన్నాయి. ఇది పసిగట్టిన సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం ఆ భూములను ప్రభుత్వ నిబంధనలు, దేవదాయశాఖ అనుమతులతో సంబంధం లేకుండా వాటిని ఆక్రమించేసింది. 11 ఎకరాల భూమి స్వామి వారికి నైవేద్యం పెడుతున్న బ్రాహ్మణుల సాగులో ఉన్నాయి. వీటితో పాటు మరో 64 సెంట్ల భూమిని సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం ఆక్రమించి గోదాముల నిర్మాణం చేపట్టింది. బ్రాహ్మణ మాన్యాలుగా ఉన్న భూము ల్లో సున్నపు రాయి గనులు ఉండగా వాటికి వెల కట్టకుండా అప్పనంగా సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యానికి అప్పగించారు. ఇంత జరుగుతున్నా దేవదాయశాఖ అధికారులు పట్టించుకోకపోవడంపై భక్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గత పాలకుల అండతో అడిగే వారే లేకపోవడంతో భూములు ఆక్రమించి గోడౌన్లు నిర్మించగా ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో కూడా ఎవరూ పట్టించుకోవడం లేదని భక్తులు వాపోతున్నారు.



పెదగార్లపాడులోని వేణుగోపాల స్వామి దేవాలయం

సాగునీటి కాల్వలనూ పూడ్చేశారు ..

పొలాల్లోని సాగు నీటి కాల్వలను కూడా సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం పూడ్చి వేసింది. వందల ఎకరాలకు సాగు నీరు ఇస్తున్న కాల్వలను పూడ్చి వేయడంతో రైతులు సాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యాజమాన్యంతో పో రాడలేక రైతులు మిన్నకుండి పోతున్నారు.

జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు లబ్ధి

కర్లకుంట సభలో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

రొంపిచర్ల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): వివిధ రకాల వస్తువులపై జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు పెద్దఎత్తున లబ్ధి చేకూరుతుందని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. మండలంలోని కర్లకుంట గ్రామంలో గురువారం సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్, సూపర్-6, సూపర్ హిట్ కార్యక్రమంలో ఎంపీ ప్రసంగించారు. సూపర్-6లో ఇచ్చిన హామీలను కూడా అమలు చేస్తుండటంతో ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని ఆదరిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కూడా కూటమి ప్రభుత్వాన్ని గెలిపించాలని కోరారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో వైసీపీ నేతలను ఊరిబయట నుంచే సాగనంపాలన్నారు. బీసీలకు అండగా ప్రభుత్వం నిలుస్తుందన్నారు. మైనింగ్‌లో వడియరాజులకు 15 శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్య క్రమంలో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, టెక్నాలజీ చైర్మన్ మన్నవ మోహన్‌కృష్ణ, వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ ఈశ్వరరావుతో పాటు పల్లెల నాగిరెడ్డి, గాడపర్తి సురేష్, వడ్లమూడి వెంకటకిశోర్, లింగా వెంకటేశ్వర్లు, పొనుగోటి రామారావు తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే అరవిందబాబు



మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా, జేసీ సూరజ్

22ఏ భూముల సమస్యలు పరిష్కరించండి

అధికారులను ఆదేశించిన కలెక్టర్ కృతికా శుక్లా

నరసరావుపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 22ఏ భూముల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ కృతికాశుక్లా రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఆస్పత్రుల్లో పరిశుభ్రత, ప్రధానమంత్రి ఆదర్శ్ గ్రామ రోజ్‌గార్ యోజన, ఎస్సీఎస్టీ అత్యాచార బాధితులకు పరిహారం చెల్లింపు, ఎస్సీ కార్పొరేషన్ పథకాలు, పింఛన్ల పరిశీలన తదితరాలపై జేసీ సూరజ్ ధనుంజయ్‌తో కలిసి కలెక్టరేట్‌లో గురువారం కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సదరు భూముల కేటాయింపు, హక్కుల గుర్తింపు, సంబంధిత పత్రాల పరిశీలన చేయాలన్నారు. భూ వివాదాలను పరిష్కరించాలని తెలిపారు. సీజనల్ వ్యాధుల విషయంలో వైద్యశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

టీడీపీకి కార్యకర్తలే సైనికులు

● నష్టపోయిన ప్రతి కుటుంబానికి అండగా ఉంటాం : మంత్రి లోకేశ్


మంత్రి లోకేశ్‌తో దివంగత శేషగిరిరావు కుటుంబ సభ్యులు

రెంటచింతల, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్తలే సైనికులని.. వైసీపీ అరాచకపాలనలో నష్టపోయిన ప్రతి కార్యకర్త కుటుంబానికి అండగా ఉండి అన్ని విధాల ఆదుకుంటామని రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ భరోసా నిచ్చారు. పాలువాయిగేట్ గ్రామానికి చెందిన దివంగత నంబూరి శేషగిరిరావు సతీమణి కృష్ణవేణి కుటుంబ సభ్యులతో కలిసి ఉండవల్లిలోని క్యాంప్ కార్యాలయంలో మంత్రి లోకేశ్‌ను గురువారం కలిశారు. గత సార్వత్రిక ఎన్నికల్లో పాలువాయిగేట్ పోలింగ్ బూత్‌లో మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఈవీఎంను ధ్వంసం చేస్తుండగా ఏజెంట్‌గా ఉన్న శేషగిరిరావు ప్రాణాలకు తెగించి పోరాడడంతో.. వైసీపీ మూకల చేతిలో తీవ్రంగా గాయపడిన విషయాన్ని లోకేశ్‌కు వివరించారు. జూలై 20న గుండెపోటుతో భర్త శేషగిరిరావు మృతి చెందారని కృష్ణవేణి చెప్పారు. దీంతో శేషగిరిరావు పార్టీ కోసం చేసిన త్యాగం వృథాకాదని, అందరం టీడీపీ కుటుంబ సభ్యులమని లోకేశ్ వారికి ధైర్యం చెప్పారు. వారి బాగోగులను వ్యక్తిగతంగా తాను చూసుకుంటానని హామీ ఇచ్చారు. కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్న ప్రతి ఒక్కర్ని గుండెల్లో పెట్టుకుని గౌరవిస్తామని భరోసా కల్పించారు.

ప్రజాదరణ లేని పర్యటనలతో జగన్ కాలక్షేపం : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రజాదరణ లేని పర్యటనలతో జగన్ కాలక్షేపం చేస్తున్నారని, మళ్లీ మళ్లీ అవే అబద్ధాలు చెబుతూ ప్రజలను మభ్యపెడుతున్నారని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఒక ప్రకటనలో విమర్శించారు. అధికారంతో పాటు మెడికల్ కాలేజీలనే బంగారు బాతుల్ని కోల్పోయానన్న బాధతోనే ప్రభుత్వంపై జగన్ విషం కక్కుతున్నారని ఆరోపించారు. జాతీయ ఆరోగ్య మిషన్ నిధుల్ని దారి మళ్లించి, జనం ఆరోగ్యం కాపాడానని చెప్పడం జగన్‌కే చెల్లిందన్నారు. నెట్‌వర్క్ ఆసుపత్రులకు ఆరోగ్యశ్రీ బకాయిలు ఎగ్గొట్టిన జగన్.. పేదలకు కార్పొరేట్ వైద్యం అందించానని చెప్పడం సిగ్గుచేటన్నారు. 108, 104 ఉద్యోగులకు జీతాలు ఇవ్వకుండా రోడ్డెక్కించడం జగన్ వైద్య రంగంలో చేసిన అభివృద్ధి అని ఎద్దేవా చేశారు.

53,371 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 54,252 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 53,371 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 10,401 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9800	12500
334	10000	14500	ఏసీ కామన్ వెరైటీ		
నెంబరు. 5	10000	14000	334	10500	14600
273	---	---	నెంబరు. 5	10000	14200
341	10000	15200	341	10000	15300
4884	----	----	4884	10000	14500
సూపర్ 10	----	---	సూపర్ 10	11000	14500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	15000	తేజ	10000	15200
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	15500
బ్యాడిగి	10500	15600	దేవనూరు డీలక్స్	10500	14200
దేవనూరు డీలక్స్	10000	14000	తాలుకాయలు	5000	7700

4 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల



సాగర్‌లో 4 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

విజయపురిసౌత్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఎగువున ఉన్న శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి నాగార్జున సాగర్ ప్రాజెక్ట్‌కు వరద నీరు వస్తుండడంతో ప్రాజెక్ట్ అధికారులు గురువారం 4 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నీటిమట్టం 589.00 అడుగులు ఉంది. ఇది 312.04 టీఎంసీలకు సమానం. కుడి కాల్వ ద్వారా 10,040, ఎడమ కాలువ ద్వారా 7,272, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,779, 4 క్రస్ట్‌గేట్లను 5 అడుగులు మేర ఎత్తి 32,400, మొత్తం ఔట్ ఫ్లో 83,491 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 83,491 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతలకు 64,012 క్యూసెక్కులు..

రెంటచింతల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు 20 రేడియల్ క్రస్ట్‌గేట్లకు గాను 3 గేట్లను 3.5 మీటర్ల మేర ఎత్తి పులిచింతలకు 55,674 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి అనంతరం టీఆర్‌సీ ద్వారా 8338 క్యూసెక్కులు.. మొత్తంగా 64,012 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈలు తెలిపారు. ఎగువన సాగర్ నుంచి 83,491 క్యూసెక్కులు వస్తుందని తెలిపారు. బుధవారం అర్ధరాత్రి 12 గంటల వరకు 2 యూనిట్ల ద్వారా 1.0224 ఎంయూల విద్యుత్ ఉత్పత్తి అయ్యిందని, రిజర్వాయర్‌లో 75.47 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 7.059 టీఎంసీలకు సమానమన్నారు.

ప్రకాశం బ్యారేజి వద్ద కొనసాగుతున్న వరద ఉధృతి


ప్రకాశం బ్యారేజి దిగువకు విడుదల అవుతున్న కృష్ణానది వరదనీరు

తాడేపల్లి టౌన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన పులిచింతల ప్రాజెక్టుతోపాటు మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుండి 1,11,880 క్యూసెక్కుల వరద నీరు గురువారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతున్నట్టు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా దిగువకు 93, 900 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టా కాలువకు 10291, పశ్చిమ డెల్టాకు 7508, గుంటూరు చానల్‌కు 181 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

అనుమతుల్లేని రూ. 97 లక్షల విలువైన సిగరెట్లు స్వాధీనం


సిగరెట్ ప్యాకెట్లను పరిశీలిస్తున్న జీఎస్టీ, విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

గుంటూరు సిటీ, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేని హానికరమైన సిగరెట్లను తీసుకొచ్చి.. ఉమ్మడి గుంటూరు జిల్లాలో విక్రయిస్తున్న ముఠా గుట్టును జీఎస్టీ, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రట్టు చేశారు. గుంటూరులోని బుడంపాడు రోడ్డులో ఉన్న అన్నపూర్ణ కమర్షియల్ కాంప్లెక్స్ నంబరు 106 గోడౌన్‌పై విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. సిగరెట్ గన్నీలను ఇనుము స్క్రాప్ ముసుగులో అక్రమంగా రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. లారీ డ్రైవర్ గగన్‌కుమార్‌ను అదుపులోనికి తీసుకుని విచారించగా.. ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. నంబూరు సుబ్బారావు గుప్తా, సీహెచ్ మురళీకృష్ణ షాపును అద్దె తీసుకొని అనుమతి లేని సిగరెట్లు తీసుకువచ్చి విచ్చలవిడిగా అమ్మకాలు జరుపుతున్నట్లు తేలింది. భువనేశ్వర్‌కు చెందిన కృష్ణా అనే వ్యాపారి నుంచి వీటిని కొనుగోలు చేస్తున్నట్లు గుర్తించారు. ఈ దాడుల్లో జీటీపీఎల్ విమల్ రకానికి చెందిన 1,79,200 ప్యాకెట్లు (విలువ రూ.71.68 లక్షలు), మిడ్ ల్యాండ్ రకానికి చెందిన 6,400 ప్యాకెట్లు (రూ.5.76 లక్షలు), గోల్డ్ విమల్ రకానికి చెందిన 6,400 ప్యాకెట్లు (విలువ రూ.6.40 లక్షలు), గోల్డ్ స్టైప్ రకానికి చెందిన ప్యాకెట్లు 2,400(రూ. 9.60 లక్షలు), గోల్డ్ స్టేజ్ రకానికి చెందిన ప్యాకెట్లు 7,200(రూ.3.60 లక్షలు) స్వాధీనం చేసు కున్నారు. విక్రేతలపై పాత గుంటూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమో దు చేశారు. ఈ దాడులలో జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ కె.శ్రీధర్, విజిలెన్స్ సీఐ కె.చంద్రశేఖర్, ఎఫ్ఆర్‌ఓ ఎస్కే సైదులు, ఆర్ఐ ఎస్కే కరిముల్లా పాల్గొన్నారు.

తెలుగు రాష్ట్రాల ఇంటి దొంగ అరెస్టు

● రూ.7 లక్షల విలువ గల సొత్తు స్వాధీనం


కేసు వివరాలను వెల్లడిస్తున్న సీసీఎస్ డీఎస్పీ పీ జగదీష్ నాయక్

బాపట్లరూరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాల్లో పగటిపూట ఇంటి దొంగతనాలకు పాల్పడే నిందితుడిని బాపట్ల జిల్లా సీసీఎస్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. అతడి నుంచి సుమారు రూ.7లక్షలకుపైగా విలువైన చోరీసొత్తును స్వాధీనం చేసుకున్నారు. జిల్లా సీసీఎస్ పోలీసు స్టేషన్ ఆవరణంలో సీసీఎస్ డీఎస్పీ పి.జగదీష్ నాయక్ వివరాలు వెల్లడించారు. పల్నాడు జిల్లా యడ్లపాడు గ్రామానికి చెందిన కోడిరెక్క విజయ్‌కుమార్ అనే వ్యక్తి సుమారు ఐదేళ్ల నుంచి దొంగతనాలు చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణలో 6 చోట్ల, ఏపీలో రెండు ప్రదేశాలలో మొత్తం 8 చోట్ల దొంగతనాలకు పాల్పడ్డాడని వివరించారు. ఇటీవల అద్దంకి, సంతమాగులూరు, మార్టూరు పోలీసు స్టేషన్ల పరిధిలో పగటిపూట ఇంటి దొంగతనాలు చేశాడని చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి గురువారం సాయంత్రం అద్దంకి, మేదరమెట్ల బైపాస్ రోడ్డు జంక్షన్ వద్ద సీసీఎస్ పోలీసు అధికారులు నిందితుడిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. కేసు ఛేదనలో ప్రతిభ కనబరిచిన సీసీఎస్ పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ అభినందించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

తెనాలి క్రైం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): చౌక బియ్యం తరలిస్తున్న మినీ లారీని వన్‌టౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుర్రిపాలెం రోడ్డులోని పాలార్రి కాల్వ వద్ద గల లక్ష్మీనగర్ కాలనీలోని చౌకడిపో నుంచి 29 బస్తాల బియ్యాన్ని మినీ లారీలో చుండూరులోని అమృతలూరు కోటేశ్వరరావు రైస్ మిల్లుకు తరలిస్తున్నారు. వన్‌టౌన్ పోలీసులు లారీని బుధవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. బియ్యం తరలిస్తున్న తాడిబోయిన అశోక్, లారీ డ్రైవర్ సందీప్‌ను అరెస్టు చేశారు.

అడిగొప్పుల ఆలయ హుండీ ఆదాయం రూ.50,17,019


హుండీ లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఈవో సుభద్ర

దుర్గి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడిగొప్పులలో వేంచేసియున్న నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి ఆలయ హుండీ ఆదాయం గురువారం లెక్కించారు. 82 రోజులకు గాను రూ. 50,17,019గా వచ్చింది. శ్రీజగన్నాథస్వామి గ్రూపు దేవస్థాన సహాయ కమిషనర్, ఈవో సుభద్ర హుండీ లెక్కింపును పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త యాగంటి వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ కమిషనర్ ఆదిశేషనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ మహిళా ఉద్యోగిపై వేధింపులు


జాజుల తిరుపతయ్య

యడ్లపాడు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయ మహిళా ఉద్యోగిపై వేధింపులకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కారుచోల గ్రామ సచివాలయంలో వెటర్నరీ అసిస్టెంట్‌గా బాధిత ఉద్యోగిని పనిచేస్తోంది. పశువులకు వైద్యం చేయాలంటూ అదే గ్రామానికి చెందిన జాజుల తిరుపతయ్య అనే వ్యక్తి ఆమెను ఇంటికి పిలిచాడు. పశువులను పరీక్షిస్తుండగా ఒక్కసారిగా తిరుపతయ్య మహిళా ఉద్యోగి చేయి పట్టుకుని లాగాడు. దీనితో భయపడిన ఆమె పెద్దగా కేకలు వేసింది. చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకుని ఆరా తీశారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు బాధితురాలి ఫిర్యాదు మేరకు.. తిరుపతయ్యను అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివరామకృష్ణ తెలిపారు.

ప్రత్తిపాడులో పట్టపగలు చోరీ

ప్రత్తిపాడు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ప్రత్తిపాడులో పట్టపగలు ఇంట్లో దొంగతనం జరిగింది. బియ్యం డబ్బాలో పెట్టిన 8 సవర్ల బంగారు ఆభరణాలతో పాటు రూ.10 వేల నగదు దోచుకెళ్లారు. ప్రత్తిపాడు పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన సెలూన్ నిర్వాహకుడు చేబ్రోలు శ్రీనివాసరావు, ఆయన తల్లి ఇద్దరూ ఇంట్లో లేని సమయంలో.. ఈ దొంగతనం జరిగింది. మధ్యాహ్నం ఇంటికి వచ్చిన శ్రీనివాసరావు తలుపు తీసి ఉండడం గమనించాడు. మంచం వెనుక ఉన్న డబ్బాలో బంగారంతో పాటు డబ్బులు మాయమవడాన్ని గుర్తించి ప్రత్తిపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో క్లూస్ టీం వచ్చి వేలి ముద్రలు సేకరించారు. ఎస్ఐ నరహరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్లెక్సీ వివాదంలో 50 మందిపై కేసు నమోదు

ప్రత్తిపాడు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): యనమదలలో ఎన్‌టీఆర్ ఫ్లెక్సీ వివాదంలో జరిగిన కొట్లాటలో.. ప్రత్తిపాడు పోలీసులు ఇరు వర్గాలపై కేసు నమోదు చేశారు. గ్రామంలో అలజడి సృష్టించిన నేపథ్యంలో ఇరు వర్గాలకు చెందిన 50 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరహరి తెలిపారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్(కిలో)	123, 132, 142
చికెన్ విత్ స్కిన్(కిలో)	230.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	240.00

విద్యార్థిని గాయపరిచిన ఘటనపై విచారణ

చెరుకుపల్లి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి):మండలంలోని గుళ్ళపల్లిలో ఉన్న ఎన్ఆర్ఐ జూనియర్ కళాశాలలో విద్యార్థిని గాయపరిచిన ఘటనపై జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి జుబేర్ గురువారం కళాశాలలో విచారణ నిర్వహించారు. గొడవ జరిగిన తరగతి గదికి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. ప్రిన్సిపల్, వైస్‌ప్రిన్సిపల్ సిబ్బందితో మాట్లాడి వివరాలను నమోదు చేశారు. బాధిత విద్యార్థి చికిత్స నిమిత్తం మచిలీపట్నంలో ఉండటంతో.. వచ్చిన తర్వాత వారిని కూడా విచారించి తుది నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని ఆయన ఈ సందర్భంగా విలేకరులకు తెలిపారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కళాశాల బయట ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మాజీ కార్యదర్శి మనోజ్, నేతలు నిరసన వ్యక్తం చేశారు. జుబేర్‌కు వినతి పత్రం అందించారు.

పాడి పరిశ్రమ అభివృద్ధికి బాటలు

అందుబాటులో లింగ నిర్ధారణ ఇంజక్షన్లు
పశు సంవర్ధక శాఖ డీడీ డాక్టర్ రామారావు

అచ్చంపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పశువులకు లింగ నిర్ధారణ ఇంజక్షన్‌లు అందుబాటులో ఉన్నాయని పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ పి.రామారావు తెలిపారు. గురువారం అచ్చంపేటలోని పశువుల ఆస్పత్రిని ఆయన సందర్శించి, రికార్డులు తనిఖీ చేశారు. సిబ్బంది పని తీరును డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో డాక్టర్ రామారావు మాట్లాడుతూ.. పశువులకు పడ్డ దూడలు పుట్టే విధంగా ఇంజక్షన్‌లు అందుబాటులో ఉన్నాయని, దీని ద్వారా పాడి పరిశ్రమను అభివృద్ధి చేయవచ్చని తెలిపారు. ఏటా 1.89 లక్షల పశువులకు ఎద ఇంజక్షన్లు వేస్తామని, దీని ద్వారా మేలు జాతి పశువుల ఉత్పత్తిని పెంచ వచ్చన్నారు. జిల్లాలో 3.85 లక్షల నల్ల జాతి పశువులు, 58 వేల తెల్ల జాతి పశువులు ఉన్నాయన్నారు. 3.50 లక్షల పశువులకు గాలికుంటు వ్యాక్సిన్ వేశామని, మిగిలిన పశువులకు ఈ నెల 15వ తేదీకి వ్యాక్సినేషన్ పూర్తి చేస్తామన్నారు. జిల్లాలో 920 రెండవ విడత గోకులాల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. మండలంలో 19,642 గేదెలు, ఆవులకు గాలికుంటు వ్యాక్సిన్ వేశామని, 44,270 మేకలు, గొర్రెలు ఉన్నాయని, వీటికి కూడా జబ్బులు రాకుండా వ్యాక్సిన్ వేసినట్టు తెలిపారు. రైతులు వారి పొలాల్లో బోరు బావి ఉన్నట్లయితే పశుగ్రాసం పెంచుకోవచ్చన్నారు. ప్రతి సంవత్సరం జిల్లాలో నాలుగు విడతలుగా నట్టల నివారణ మందులు వేస్తామన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ బి. ప్రతాపరెడ్డి, డాక్టర్ పి.మాధవి, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ పీ రామారావు

మునుమాక - ముత్తనపల్లి ఎల్‌సీ గేటు మూసివేత

గుంటూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): నరసరావుపేట - ముకుంద రాజుపురం రైల్వేస్టేషన్ల మధ్య ఉన్న ఆర్‌యూబీ నంబరు 279 వద్దనున్న లెవల్ క్రాసింగ్ గేటుని తాత్కాలికంగా మూసి వేస్తున్నట్లు రైల్వే సీనియర్ డీసీఎం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మునుమాక నుంచి ముత్తనపల్లి గ్రామం వెళ్లే రహదారి పునరుద్ధరణ పనులు వర్షాల వల్ల ఆలస్యం కావడంతో గేటుని ఈ నెల 10 నుంచి నవంబరు 9వ తేదీ వరకు 31 రోజుల పాటు మూసి వేయడం జరుగుతుందన్నారు. ప్రత్యామ్నాయంగా ఎల్‌సీ నంబరు 276 రైతు నగర్ మార్గంలో వాహనదారులు ప్రయాణించాలని సూచించారు.

రొయ్యరైతుకు ప్రకృతి విపత్తుల నుంచి భరోసా

● ఏఐసీ, ఏపీజీబీ మధ్యన కుదిరిన ఒప్పందం


ఒప్పందం చేసుకుంటున్న ఏఐసీ, ఏపీజీబీ అధికారులు

గుంటూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రొయ్యల సాగు చేసే రైతులకు ప్రకృతి విపత్తుల నుంచి ఆర్థిక భరోసా కల్పించేందుకు అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఏఐసీ), ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు(ఏపీజీబీ) మధ్యన ఒప్పందం కుదిరింది. గురువారం సాయంత్రం గుంటూరులోని ఏపీజీబీ కార్యాలయంలో ఎంవోయూపై రెండు సంస్థల అధికారులు సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఏఐసీ జనరల్ మేనేజర్ లలిత్ ఖర్బందా మాట్లాడుతూ భారత దేశంలోని అక్వా కల్చర్ వ్యవస్థని బలోపేతం చేసే దిశగా ఏఐసీ, ఏపీజీబీ ఈ ఒప్పందం చేసుకొన్నాయన్నారు. దీని వలన రొయ్యల రైతులకు సమగ్ర బీమా కవరేజ్, ఆర్థిక రక్షణ కల్పన జరుగుతుందన్నారు. రొయ్యల పెంపకంతో పాటు పశువులకు కూడా ఈ బీమాని విస్తరించేందుకు లక్ష్యంగా పెట్టుకొన్నామన్నారు. దీని వలన రైతులకు ఆర్థికంగా భరోసా కలుగుతుందని చెప్పారు. రైతులు వ్యవసాయ రుణాలను కాపాడుకోవడానికి కూడా ఈ బీమా వీలు కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసీ ఏపీ రీజనల్ మేనేజర్ జీజీ రాజు, స్టేట్ బిజినెస్ హెడ్ జె.నితీష్ గౌడ, ఏపీజీబీ చైర్మన్ కె. ప్రమోద్ కుమార్‌రెడ్డి, జనరల్ మేనేజర్లు కె.జనార్దనరావు, ఎ.రాజశేఖరం పాల్గొన్నారు.

దీక్షలు చేస్తున్న వైద్యులకు మాచవరం వైద్యాధికారుల మద్దతు

మాచవరం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): విజయవాడలో డిమాండ్ల సాధన కోసం దీక్షలు కొనసాగిస్తున్న వైద్యులకు తమ మద్దతు ప్రకటిస్తున్నట్లు మాచవరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యులు ప్రసాదరావు గురువారం తెలిపారు. వైద్యుల సక్రమమైన డిమాండ్లు కూడా పరిశీలించటం లేదని, డిమాండ్లు పరిష్కరించే వరకు వైద్యుల దీక్షలకు తమ మద్దతు కొనసాగుతుందని తెలిపారు. ఇన్‌సర్వీస్ పీజీ కోటా పునరుద్ధరించాలని, సమయ పాలిత ప్రమోషన్‌లు ఇవ్వాలని తదితర డిమాండ్లు తప్పనిసరిగా ప్రభుత్వం నెరవేర్చాలని ఆయన కోరారు.


ఆర్‌డీఎస్ఎస్ పనులను ప్రారంభిస్తున్న ఏపీసీపీడీసీఎల్ ఈఈ రాంబొట్ల, డీఈఈ బీ వెంకటేశ్వరరెడ్డి, రావెల సత్యనారాయణ

కండ్లకుంటలో ఆర్‌డీఎస్ఎస్ విద్యుత్ పనులకు శంకుస్థాపన

నకరికల్లు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విద్యుత్‌ను వినియోగదారులకు అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ఏపీసీపీడీసీఎల్ ఈఈ సీహెచ్ రాంబొట్ల తెలిపారు. గురువారం మండలంలోని కండ్లకుంటలో రూ 2కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న ఆర్‌డీఎస్ఎస్ పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ నిర్మాణాలు పూర్తయితే 24 గంటలు నాణ్యమైన త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చాగల్లు, కండ్లకుంట, చీమలమర్రి గ్రామాలకు అందనున్నట్టు వివరించారు. ఇప్పటికే మండలంలోని గ్రామాల్లో ఆర్‌డీఎస్ఎస్ పథకం కింద విద్యుత్ లైన్‌లను పునరుద్ధరించినట్లు తెలిపారు. ప్రస్తుతం కుంకలగుంట, గుండ్లపల్లి గ్రామాల్లో ఈ పథకం పనులు తుది దశకు చేరుకుందన్నారు. నరసింగపాడు, చేజర్ల, నకరికల్లు గ్రామాల్లో త్వరలో ఈ పథకం కింద విద్యుత్ లైన్‌లను ఆధునీకరించనున్నట్టు తెలిపారు. దీంతో మండలంలోని అన్ని గ్రామాలకు నా ణ్యమైన విద్యుత్ సరఫరా అందుబాటులోకి రానున్నదన్నారు. డీఈఈ భవనం వెంకటేశ్వరరెడ్డి, రావెల సత్యనారాయణ, కోడెల అబ్బయ్య, పమిడి రామయ్య, పెమ్మసాని లక్ష్మీనారాయణ, సర్పంచ్ రావెల సాయి నవీన్, రావెల లింగయ్య పాల్గొన్నారు.

నాగోతు చిన్నమ్మకు ఎమ్మెల్యే కన్నా నివాళి


నాగోతు శౌరయ్యను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కన్నా

నకరికల్లు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగోతు శౌరయ్య మాతృమూర్తి నాగోతు చిన్నమ్మ అంత్యక్రియల్లో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ గురువారం పాల్గొన్నారు. శౌరయ్య కుటుంబసభ్యులకు కన్నా ప్రగాఢ సానుభూతిని తెలిపారు. నలబోతు వెంకటరావు, గోగినేని కోటేశ్వరరావు, దరువూరి నాగేశ్వరరావు, షేక్ అలీబాషా, సాగి శ్రీను, కరాలపాటి వలి తదితరులు ఉన్నారు.

జాతీయ కుటుంబ ప్రయోజన పథకం అమల్లో లేదు

నకరికల్లు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): జాతీయ కుటుంబ ప్రయోజన పథకం అమల్లో లేదని తహసీల్దార్ కే పుల్లారావు స్పష్టం చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల్లో జాతీయ కుటుంబ ప్రయోజన పథకం ద్వారా కుటుంబాలకు ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందని ప్రచారం జరుగుతుండటంతో కొందరు తన దృష్టికి తెచ్చారని, ప్రస్తుతం ఆ పథకం అమల్లో లేదన్న విషయాన్ని అందరికి తెలియజేస్తున్నట్టు తెలిపారు. సంక్షేమ పథకాలు ఏవైనా తమ శాఖ ద్వారా అమలయ్యేవి ఉంటే తాము తెలియజేస్తామని తెలిపారు. ఎవ్వరూ అపోహలకు గురి కావద్దన్నారు.

సంక్షిప్తం...

● రెంటచింతల: మండలంలో టీచర్ పోస్టుల కేటాయింపులో ప్రభుత్వం చిన్నచూపు చూసిందని ఎస్టీయూ జిల్లా కౌన్సిల్ సభ్యుడు లేళ్ల శ్రీనివాసరావు అన్నారు. 61 టీచర్ పోస్టులు ఖాళీగా వుంటే 37 పోస్టులను చూపించడం బాధాకరమన్నారు.

● కారంపూడి: స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో శ్రీవాసవీ సేవా అన్నప్రసాద కమిటీ ఆధ్వర్యాన గర్భిణులకు, వైద్య సిబ్బందికి గురువారం అన్న ప్రసాదం పంపిణీ చేశారు. సముద్రాల ప్రకాష్, రేణుక దంపతుల కుమార్తె శృతి, కుమారుడు శ్రీకారం ఈ సేవా కార్యక్రమానికి సహకరించారు. కార్యక్రమంలో వెలుగూరు శేషారావు, భారతి దంపతులు, కమిటీ వ్యవస్థాపకుడు భవిరిశెట్టి రామారావు, వైద్యశాల ఇన్‌చార్జి డాక్టర్ వెంకటేశ్వర్లు, సీహెచ్‌వో మల్లయ్య, సూపర్‌వైజర్ మస్తాన్‌వలి పాల్గొన్నారు.

● అచ్చంపేట: నూనెలు, ఉప్పు, చెక్కెర ఎక్కువగా వాడటం వల్ల ఊబకాయం వస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే పద్మ అన్నారు. గురువారం పెదపాలెం సెక్టార్‌లోని వేల్పూరు 4వ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవం జరిగింది. తాజా పాలు, పండ్లు, ఆకుకూరలు, ఉడికించిన శనగలు, అలసందలు, పెసలు పిల్లలకు పెట్టాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, పాల్గొన్నారు.

● అమరావతి: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో గురువారం వైద్యసేవల కోసం వచ్చిన గర్భిణులకు జనచైతన్య సమితి ఆధ్వర్యంలో పెదకూరపాడు మండల మాజీ టీడీపీ అధ్యక్షుడు అర్తిమళ్ల రమేష్ సహకారంతో పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెదకూరపాడు డీసీ చైర్మన్ వి.అప్పారావు, బీ సౌజన్య, సమితి నిర్వాహకులు పాల్గొన్నారు.

● మాచవరం: గుంటూరులోని ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ వ్యక్తి మరణించిన సంఘటన మండలంలోని పిల్లుట్లలో జరిగింది. ఎస్‌ఐ తిరుపతిరావు కథనం మేరకు.. పిల్లుట్ల గ్రామానికి చెందిన కంప వెంకటేశ్వర్లు(59) వ్యవసాయ కూలి పనుల నిమిత్తం ఈనెల 3వ తేదీన కనిగిరి శ్రీను దేవాలయ ప్రాంగణంలోని తోటలో ఎద్దు పొడవటంతో తీవ్ర గాయాలయ్యాయి. అతను గుంటూరు ప్రభుత్వవైద్యశాలలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. అతని భార్య సీతారావమ్మ ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

● రెంటచింతల: రెంటచింతల పరిధిలోని ఆంజనేయస్వామి మాన్యంలో జూదమాడుతున్న ఆరుగుర్ని అరెస్ట్‌చేసి వారి నుంచి రూ.3వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ సీహెచ్ నాగార్జున చెప్పారు.

పాఠశాలల్లో బోధనేతర పనులు బహిష్కరిస్తున్నట్టు ఎంఈవోకు వినతి

క్రోసూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో బోధనేతర పనులు శుక్రవారం నుంచి బహిష్కరిస్తున్నట్టు మండలానికి చెందిన ఫ్యాప్టో నాయకులు తెలిపారు. ఈ మేరకు ఎంఈవో ఎం గణేష్‌కు వారు వినతిపత్రం సమర్పించారు. పాఠశాలల్లో విద్యార్థులకు పాఠాలు చెప్పటం జరుగుతుందని, భోజనం పెట్టడం జరుగుతుందని, బోదనేతర పనులు మాత్రం ఎంత మాత్రం చేయమని వారు స్పష్టం చేశారు. విద్యా శక్తి కార్యక్రమం కూడా బహిష్కరిస్తున్నట్టు పేర్కొన్నారు. వినతి పత్రం సమర్పించిన వారిలో ఫ్యాప్టో నాయకులు చిలకా సురేష్, దొప్పలపూడి వెంకటేశ్వరరావు, ప్రకాశరావు, రవికాంత్, ధర్మారావు, వెంకటరావు, రాంబాబు తదితరులు ఉన్నారు.

భక్తులకు మెరుగైన సేవలందించాలి

● అమరేశ్వరాలయ ధర్మకర్తల మండలి ప్రమాణస్వీకారంలో ఎమ్మెల్యే ప్రవీణ్


ఎమ్మెల్యే ప్రవీణ్ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేస్తున్న ధర్మకర్తల మండలి చైర్మన్, సభ్యులు

అమరావతి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): అమరావతి శ్రీబాలచాముండికా సమేత అమరేశ్వర స్వామి దేవస్థాన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం గురువారం ఆలయ ప్రాంగణంలో ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ధర్మకర్తల మండలి చైర్మన్‌గా ఆలయ ధర్మకర్త వాసిరెడ్డి మురళీకృష్ణప్రసాద్, సభ్యులుగా ఘంటా పున్నారావు, వడ్లమూడి శివపార్వతి, పి.నాగేశ్వరశర్మ, మేకల శివశంకర్, పి.వెంకటసత్యనారాయణ, ఆలా వీరబాబు, నాదెండ్ల శ్రీదేవి, సూరేపల్లి అనూష, ఎం వెంకటరమణ, ఎం ఉషారాణిలతో పాటు ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఆలయ ప్రధానార్చకులు కె సుధీర్‌శర్మలచే ఈఓ రేఖ ప్రమాణం చేయించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ధర్మకర్తల మండలి సభ్యులు భక్తులకు సేవలు అందించడంతో పాటు ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. రానున్న మహాశివరాత్రి పర్వదినానికి రాష్ట్ర పండుగగా గుర్తించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అమరావతి వచ్చే భక్తులకు గ్రామ ముఖద్వారాల వద్ద పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాలక మండలి సభ్యులు ఘంటా పున్నారావు మాట్లాడుతూ ఆలయంలో గ్రానైట్ శిథిలావస్థకు చేరిందని, నూతనంగా గ్రానైట్ వేసేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. ఆలయ అభివృద్ధిలో దాతల సహకారంతో మరిన్ని కార్యక్రమాలు చేస్తానన్నారు. అనంతరం పాలకమండలి సభ్యులను ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో సభ్యుల కుటుంబసభ్యులు, పలువురు ప్రజాప్రతినిదులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రూ.లక్ష కోట్ల మద్యం స్కాంలో నిందితుడు జగన్

● వడ్డెర సంఘం కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దుర్గారావు


దుర్గారావు

మాచర్ల, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): లక్ష కోట్ల మద్యం స్కాంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిందితుడని వడ్డెర సంఘం కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మద్యం తయారీ, అమ్మకాలపై జగన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు సరికాదన్నారు. అక్రమ మద్యం తయారీ, తరలింపు, అక్రమ మద్యానికి 30 వేల మందిని బానిసలుగా చేసి వారి మరణానికి కారణమైంది జగన్ కాదా అని ప్రశ్నించారు. మెడ్‌డొనాలస్ కంపెనీకి అక్రమ మద్యానికి తరలించేది ఎవరంటూ ప్రశ్నించారు.

కూటమి ప్రభుత్వంతో పేద కుటుంబాలలో వెలుగులు


క్రోసూరులో జరిగిన అవగాహన ర్యాలీ


అచ్చంపేట: జీఎస్టీ తగ్గింపు కరపత్రాలను ప్రదర్శిస్తున్న అధికారులు

అమరావతి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో ఎన్డీఏ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో పేద కుటుంబాలలో వెలుగులు కన్పిస్తున్నాయని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. గురువారం అమరావతిలో జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ పలు దుకాణాలను సందర్శించారు. సూపర్ సిక్స్ పథకాలతోపాటు జీఎస్టీ తగ్గింపుతో ప్రజలపై భారం తగ్గి కొనుగోలు శక్తి, పొదుపు పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ హనుమంతరావు, పీఏసీఎస్ చైర్మన్‌లు జగదీష్, నాగార్జున, సూర్యనారాయణ, డీసీ చైర్మన్ బీ వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

జీఎస్టీ 2.0తో తగ్గనున్న ఫార్మాస్యూటికల్ ధరలు

క్రోసూరు: జీఎస్టీ 2.0 సంస్కరణల వల్ల ఫార్మాస్యూటికల్ ధరలు గణనీయంగా తగ్గుతాయని కమర్షియల్ ట్యాక్స్ అధికారి చంద్రకాంత్ అన్నారు. క్రోసూరులో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జీఎస్టీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. తొలుత పీహెచ్‌సీ ఆవరణలో జీఎస్టీ సంస్కరణలపై జరిగిన అవగాహన సమావేశంలో చంద్రకాంత్‌తో పాటు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జాఫ్రిన్, మండల ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శ్యామ్‌సన్ మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ కాండ్రు కాశయ్య, అనుముల వెంకటరామిరెడ్డి, మార్కెట్ యార్డు డైరెక్టర్ దుద్దుల యో హాన్, శివుడు పాల్గొన్నారు.

● అచ్చంపేట: జీఎస్టీ 2.0 సంస్కరణల ద్వారా మందుల ధరలు తగ్గించటం, ఆరోగ్యసేవలు చౌకగా చేయటం, ప్రతి కుటుంబానికి బీమా సౌకర్యం కల్పించటమే సూపర్ జీఎస్టీ ప్రధాన ఉద్దేశమని మండల జీఎస్టీ నోడల్ అధికారి జీ సు ధాకర్ తెలిపారు. అచ్చంపేటలోని పీహెచ్‌సీలో పలువురు అధికారులు, ప్రజలతో జీఎస్టీ తగ్గుదల పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ భూక్యా స్వర్ణమ్మ రమేష్‌నాయక్, ఎంపీడీవో శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షు డు నందిగం ఆశీర్వాదం, వెనిగండ్ల కోటయ్య, స ర్పంచ్ జానీ, చల్లా అనూపకల, డాక్టర్ సాయితే జ, వెంకటరావు, పంతులునాయక్ పాల్గొన్నారు.

● బెల్లంకొండ: మండలంలోని చంద్రాజుపాలెం పీహెచ్‌సీలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్‌పై ఇన్‌చార్జ్ వైద్యాధికారి అనూష అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జీఎస్టీ 2.0 వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో మణికుమారి, సూపర్‌వైజర్ బాషా, స్టాఫ్‌నర్సు లోకేశ్వరి, ఎల్‌టీ రమేష్, ఏఎన్ఎం, హెల్త్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

● కారంపూడి: పీహెచ్‌సీలో ప్రధాని సురక్షిత మాతృత్వ అభియాన్, సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై వైద్యాధికారి వెంకటేశ్వర్లు అవగాహన కల్పించారు. బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి శెట్టి హనుమంతురావు మాట్లాడుతూ బీమా పాలసీలో వార్షికంగా రూ.10వేల వరకు తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సరస్వతిబాయి బాలునాయక్, టీడీపీ నేత లింగాల శ్రీనివాసరావు, స్వచ్ఛ భారత్ కోఆర్డినేటర్ కూరపాటి సుబ్బారావు, ఆశాలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

● దుర్గి: దుర్గి పీహెచ్‌సీలో డాక్టర్ దయానిధి సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కటకం రామ్మోహనరావు, మారుగుండ్ల వేణుగోపాల్, వెలిదండి శ్రీనివాసరావు, సీహెచ్‌వో కల్పన, మలేరియా యూనిట్ సద్గురు, ల్యాబ్ టెక్నీషియన్ సుబ్బారావు, ఏఎన్ఎం విజయలక్ష్మి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

● పిడుగురాళ్ల: పట్టణంలోని ఎల్ఐసీ కృష్ణారావు బజారులోని అర్బన్ ప్రాథమిక వైద్యశాలలో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై సమావేశం జరిగింది. డాక్టర్ పి.అనిల్‌కుమార్, ఆయుష్ వైద్యాధికారి మేఘమాలలు మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో పలు రకాల మందుల ధరలు తగ్గాయన్నారు. ఏఎంసీ చైర్మన్ తురకా వీరస్వామి, యేలూరి శశికుమార్, పిల్లి చెన్నారావు, పాండురంగ శ్రీను, వడ్డవల్లి సాంబశివరావులు మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో ప్రతి కుటుంబానికి ఏడాదికి రూ.50వేల ఆదాయం సమకూరనుందన్నారు. సమావేశంలో పణితి రవి, కామిశెట్టి రమేష్, సుతారు మల్లేశ్వరరావు, షేక్ సైదా, వెంకయ్య, గోళ్ల కిరణ్, బిజిలి వెంకటరావు, వల్లెపు రామకృష్ణ పాల్గొన్నారు.

● దాచేపల్లి: సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్‌తో విద్యార్థులకు కూడా మేలు జరిగిందని జీఎస్టీ నోడల్ అధికారి కే శివశంకర్ తెలిపారు. దాచేపల్లిలోని సరస్వతి డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్ కోట శాయన్న జీఎస్టీ మినహాయింపుల గురించి అవగాహన కల్పించారు.

● రాజుపాలెం: జీవిత, ఆరోగ్య బీమా సేవలపై జీఎస్టీని 0కు తగ్గించారని పీహెచ్‌సీ వైద్యులు రవితేజనాయక్ తెలిపారు. పీహెచ్‌సీ పరిధిలోని అన్ని విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ వైద్యసేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు. రాజుపాలెంలోని పీహెచ్‌సీ వద్ద సత్తెనపల్లి కమర్షియల్ టాక్స్ అసిస్టెంట్ మేనేజర్ కె.గోపాలరావు మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు వల్ల ప్రజలు డబ్బు ఆదా చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి వసంతరావు, హెల్త్ విజిటర్ ఉషారాణి, ఎంఎల్‌హెచ్‌పీ ప్రియదర్శిని, అలేఖ్య, లక్ష్మీదుర్గ పాల్గొన్నారు.


సత్తెనపల్లి: ఏరియా వైద్యశాలలో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు


పిడుగురాళ్ల: జీఎస్టీతో కలిగే ప్రయోజనాలను వివరిస్తున్న కూటమి నేతలు

● సత్తెనపల్లి: క్రిటికల్ కేర్ మందులు, క్యాన్సర్ మందులపై జీఎస్టీ లేదని ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు అన్నారు. సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై ఏరియా వైద్యశాలలో డాక్టర్లు, సిబ్బందికి, ప్రజలకు అవగాహన కల్పించారు. జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ శ్రీదేవి జీఎస్టీ సంస్కరణల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏరియా వైద్యశాల డాక్టర్లు పాల్గొన్నారు.

కుక్కలతో ప్రజల బేజారు

● గుంపులుగా వార్డుల్లో సంచారం
● పట్టించుకోని మున్సిపల్ అధికారులు


సెరిన్ కాలనీలో గుంపులుగా సంచరిస్తున్న శునకాలు


మాచర్ల - శ్రీశైలం రహదారిలో గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

మాచర్ల రూరల్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మా చర్ల పట్టణ ప్రజలు శునకాలతో బేజారెత్తుతున్నా రు. వార్డుల్లో గుంపులుగా సంచరిస్తూ ప్రజలను, పాదచారులు, వాహనదారులను భయభ్రాంతుల కు గురి చేస్తున్నాయి. ప్రధాన రహదారులపైకి గుంపుగా చేరి రహదారిపై వాహనాల రాకపోకల కు అంతరాయం కలిగిస్తున్నాయి. శివారు కాలనీ ల్లో వీటి సంచారం మరింతగా పెరిగింది. చిన్నారు లు, వృద్ధులు వీటి ధాటికి భయాందోళన చెందుతున్నారు. ఇంటినుంచి బయటకు రావాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. రాత్రివేళల్లోనూ ఇవి గుంపుగా సంచరిస్తూ భయాందోళనకు గురిచేస్తున్నాయి. పాదచారులు, వాహనదారుల వెంటపడుతున్నాయి. ప్రధానంగా సెరిన్ కాలనీ, రోప్‌లైన్, రింగురోడ్డు, పాతూరు, శ్రీనివాస థియేటర్, మాచర్ల- శ్రీశైలం ప్రధానరహదారిలో వీటి సంచారం మరిం త అధికంగా ఉంది. పురపాలక సంఘ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా అధికారులు వీధి కుక్కల సమస్యను పరిష్కరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ముగిసిన మండల స్థాయి ఆటల పోటీలు

పిడుగురాళ్ల, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ పాఠశాలలో మండలస్థాయి క్రీడాపోటీలు గురువారంతో ముగిశాయి. మండలంలోని పలు ప్రైవేటు, జడ్పీ పాఠశాలలకు చెందిన సుమారు 200 మందికి పైగా విద్యార్థులు హాజరై యోగా, చెస్, షటిల్, అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొన్నారు. హెచ్ఎం కొత్త మల్లిఖార్జునరావు, పీడీలు ఇమ్మానియేలురాజు, డానియేలు, పీఈటీలుపోటీలు పర్యవేక్షించారు.

● రెంటచింతల: రెంటచింతలలోని నిర్వహించిన ఎస్‌జీఎఫ్ఐ క్రీడాపోటీల్లో సెయింట్ జోసఫ్ హైస్కూల్‌కు చెందిన క్రీడాకారులు డివిజన్ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ గోవిందు బాలస్వామి,హెచ్ఎం దుర్గాప్రసాద్‌లు చెప్పారు. అండర్ 14, 17 విభాగాల్లో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో మండలస్థాయిలో విన్నర్స్‌గా నిలిచారన్నారు. కార్యక్రమంలో పీఈటీలు సురేష్, కత్తి రవి, బ్రహ్మయ్య, సుభాని తదితరులు పాల్గొన్నారు.

● దాచేపల్లి: దాచేపల్లి మండలస్థాయి క్రీడా పోటీల్లో కబడ్డీలో దాచేపల్లి ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థులు విన్నర్స్‌గా నిలిచారు. పెదగార్లపాడులోని ఉన్నత పాఠశాల విద్యార్థులు రన్నర్స్‌గా, బాలికలు అండర్-17 విభాగంలో దాచేపల్లి ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు మొదటి స్థానం, దాచేపల్లి జెడ్పీ స్కూల్ విద్యార్థులు రెండో స్థానంలో నిలిచారు. హెచ్ఎం సాంబయ్య, కూటమి నేతలు బొమ్మిరెడ్డి నారాయణ, నర్రా పుల్లయ్య, అంబటి శేషగిరిరావు, కొప్పుల గిరీష్‌కుమార్, పగడాల భాస్కరరావు, నారాయణ, రుద్రాల అచ్చారావు, కూరాకుల నాగేశ్వరరావు, మీరావలి, షేక్ లాల్ అహమ్మద్, సకినాబీ తదితరులు పాల్గొన్నారు.

● సత్తెనపల్లి రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలంలోని నందిగామ జెడ్పీ హైస్కూల్‌లో మండలస్థాయి అండర్-14, అండర్-17 బాలబాలికల ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ జట్ల ఎంపికలు జరిగాయి. మొత్తం 250మంది క్రీడాకారులు హాజరయ్యారని సత్తెనపల్లి డివిజన్ కో-ఆర్డినేటర్ బీ అనీల్ దత్తానాయక్ తెలిపారు. జట్లకు ఎంపికైన క్రీడాకారులు త్వరలో జరిగే సత్తెనపల్లి డివిజ న్ స్థా యి పోటీల్లో పాల్గొం టార న్నారు. కార్యక్రమంలో హెచ్ఎం కాకరపర్తి శ్రీనివాసరావు, మండల కో-ఆర్డినేటర్ గండు సాంబశివరావు, పీఈటీ కోనంకి కి రణ్‌కుమార్, శివగోవర్ధన, రియాజ్, అచ్చిరెడ్డి, చిన్న య్య, తులసీరామ్‌నాయక్, ప్రసన్న, రత్నాకర్, అనూషా పాల్గొన్నారు.

● క్రోసూరు: స్కూ ల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో క్రోసూరు హైస్కూల్‌లో రెండు రోజులుగా జరుగుతున్న మండల స్థాయి ఆటల పోటీల విజేతలకు గురువారం బహుమతులు అందజేశారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్, రన్నింగ్, బేస్‌బాల్, హైజంప్, లాంగ్‌జంప్ విభాగంలో వివిధ పాఠశాలలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. విజేతలకు హెచ్ఎం పీ బాబూరావు, పీఈటీలు రామయ్య, కాసు ఆరోగ్యమ్మ, శ్రీలక్ష్మి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన


గన్నవరం అంగన్‌వాడీ కేంద్రంలో లబ్ధిదారుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న నీతి అయోగ్ సభ్యులు

గురజాలటౌన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): గురజాల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని గురజాలలోని రజకవీధి, మండలంలోని గంగవరం ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రాలను ఢిల్లీ నుంచి వచ్చిన నీతి అయోగ్ కమిటీ సభ్యులు గురువారం పరిశీలించారు. అంగన్‌వాడీల ద్వారా అందుతున్న సేవలను పరిశీలించారు. పౌష్టికాహారం పంపిణీపై లబ్ధిదారులను కలిసి అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీల ఆధ్వర్యాన నిర్వహించే అవగాహన సదస్సు కార్యక్రమాలను సక్రమంగా నిర్వహిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు వచ్చి ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారా లేదా అని గర్భిణులను అడిగి తెలుసుకున్నారు. కమిటీ సభ్యుల వెంట సీడీపీవో అపరంజి, జ్యోత్స్న, సూపర్‌వైజర్లు రత్నకుమారి, శ్రీలక్ష్మి, వరలక్ష్మి ఉన్నారు.

ఉపాధి హామీ కార్మికులు ఈకేవైసీ చేయించుకోవాలి


విప్పర్లలో కార్మికులకు ఈకేవైసీ చేస్తున్న ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులు

క్రోసూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): క్రోసూరు మండలంలోని ఉపాధి కార్మికులందరూ తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏపీవో వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో తిరిగి ఉపాధి హామీ కార్మికులకు ఈకేవైసీ నమోదు చేసే కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు. ఉపాధి పనుల్లో కచ్చితత్వాన్ని పాటించేందుకే ప్రభుత్వం ఈకేవైసీ నమోదు కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. క్రోసూరు మండలంలో 8,798 జాబ్ కార్డులు ఉన్నాయని, 15,034 మంది ఉపాధి కార్మికులు ఉన్నారని తెలిపారు. ఇప్పటి వరకు 6,953 మందికి ఈకేవైసీ చేసినట్టు తెలిపారు. ఈకేవైసీ యాక్టివ్ జాబ్ కార్డుదారులు అందరూ ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్ల వద్దకు వెళ్లి ఈకేవైసీ చేసుకోవాలన్నారు.

ఎస్పీని కలసిన ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన కృష్ణారావును గురువారం నరసరావుపేటలోని ఆయన కార్యాలయంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మర్యాదపూర్వకంగా కలసి బొకే అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.


ఎస్పీ కృష్ణారావును కలసిన ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ


సర్వీసు రోడ్డు గుండా పొలాల్లోకి ప్రవహిస్తున్న వర్షపునీరు

మాచర్లలో భారీ వర్షం

● దేవాలమ్మ చెరువుకు పోటెత్తిన వరద
● వరద నీటిలో మునిగిన పట్టణ బైపాస్ సర్వీసు రోడ్డు
● కోతకు గురైన పొలాలు

మాచర్ల, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణంలో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వరదనీరు దేవాలమ్మ చెరువుకు చేరి వరద పోటెత్తింది. దీంతో వరద నీరంతా చెరువుగట్టు దాటి పట్టణ బైపాస్ సర్వీసు రోడ్డు మీదుగా సమీప పొలాల్లోకి చేరింది. దీంతో పంటపొలాలు కోతకు గురయ్యాయి. బుధవారం రాత్రి మాచర్లలో 56.4మి.మీ.ల వర్షపాతం నమోదైంది. మూడురోజులపాటు ఇదేవిధంగా రాత్రివేళల్లో భారీ వర్షపాతం నమోదు కావడంతో ఎగువ నుంచి వచ్చే వర్షపునీరంతా పట్టణంలోకి ప్రవహించింది. రామాటాకీస్ లైన్‌లోని ఆంధ్రబ్యాంకు పక్కన వీధులు మోకాళ్లలోతు నిలబడ్డాయి. అలాగే నెహ్రూనగర్ ప్రధానరహదారిపై వరదనీరు చేరి రాకపోకలకు ఇబ్బంది కలిగింది. జమ్మలమడక రోడ్డులో చంద్రవంక నది పొంగిపొర్లడంతో మూడు రోజులుగా రాకపోకలు నిలిచిపోయాయి. ఆజాద్‌నగర్, వాజ్‌పేయి కాలనీ, వైఎస్ఆర్ కాలనీ, జయంతినగర్ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పట్టణంలో మురుగునీరు నిలిచిపోవడంతో పట్టణవాసులు ఇబ్బందులకు గురయ్యారు.

12.5 కిలోమీటర్లుకు రూ.5 కోట్లు మంజూరు

● 8 గ్రామాల ప్రజలకు తీరనున్న రహదారి ఇక్కట్లు

పిడుగురాళ్ల, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): గురజాల నియోజకవర్గంలో రోడ్లు వేసేందుకు రూ.5కోట్లు మంజూరయ్యాయి. మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్లు అడిషనల్ ప్లాన్‌కింద మాచవరం, గురజాల, దాచేపల్లి మండలాల్లోని పలు రహదారులకు నిధులు మంజూరయ్యాయని ఆర్‌అండ్‌బీ ఏఈ యూసుఫ్ తెలిపారు. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ప్రతిపాదనలతో పిల్లుట్ల నుండి మోర్జంపాడు మధ్యలో 2 కిలోమీటర్లు, నడికూడి-గోగులపాడు మధ్య 6.8 కిలోమీటర్లు, పులిపాడు-శ్రీనివాసపురం మధ్య 4 కిలోమీటర్లకు రూ.5కోట్లు మంజూరయ్యాయి. ఈ రహదారుల అభివృద్ధికి ప్రజల వినతిపై ఎమ్మెల్యే యరపతినేని పంపిన ప్రతిపాదనలతో ఎండీఆర్ అడిషనల్ ప్లాన్ కింద నిధులు మంజూరయ్యాయి. దీంతో 8 గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పనున్నాయి.

మంచికల్లు రహదారికి రూ.1.80 కోట్లు..

రెంటచింతల, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మంచికల్లు రహదారికి రూ.1.80 కోట్లు కేటాయించారని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చెప్పారు. ఎమ్మెల్యే ఆంధ్రజ్యోతితో ఫోన్‌లో మాట్లాడుతూ 20 సంవత్సరాల తరువాత కూటమి ప్రభుత్వం నేతృత్వంలో నూతన రోడ్డును నిర్మించబోతున్నారన్నారు. అడ్డరోడ్డు నుంచి మంచికల్లు గ్రామం వరకు 3.3 కి.మీ., గ్రామ పొలిమేరలోంచి 500 మీటర్ల సీసీ రోడ్డును 4 మీటర్ల వెడల్పులతో వేయాల్సి వుంటుందన్నారు. ఎండీఆర్ పథకం కింద ఈ నిధులు మంజూరయ్యాయన్నారు. త్వరలో టెండర్లను ఆహ్వానిస్తారన్నారు.

రైతులకు చెక్కుల పంపిణీ

పెదకూరపాడు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): రైతులు రుణాలు సమయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరస తాళ్ళూరు పీఏసీఎస్ చైర్‌పర్సన్ ఏటుకూరి రత్నకుమార్ రైతుల ఇళ్లకు వెళ్ళి చెక్కులు అందించారు. మండలంలోని లింగంగుంట్ల, హుస్సేన్ నగరం, గారపాడు, తమ్మవరం, కాశిపాడు, 75 తాళ్ళూరు, లగడపాడు, పెదకూరపాడు గ్రామాల్లో సహకార సంఘంలో రుణాలకు దరఖాస్తు పెట్టుకున్న రైతుల గృహాలకు వెళ్ళి గురువారం చెక్కులను అందించారు. చైర్‌పర్సన్ చెప్పిన మాట ప్రకారం రెండో విడత ఇళ్లకు వెళ్లి ఈ చెక్కులను రైతులకు అందించారు. సహకార సంఘం సీఈవో శివకుమారి, టీడీపీ మండల నాయకులు మేదర మెట్ల సౌమిత్‌చౌదరి, బోడపాటి సుదర్శన్, ఏటుకూరి గంగ, కిష్టమనేని లలితబాబు, అర్తిమళ్ళ ప్రభు, వీరపనేని మురళీ తదితరులు పాల్గొన్నారు.


చెక్కులు పంపిణీ చేస్తున్న సొసైటీ చైర్‌పర్సన్ రత్నకుమార్

అమ్మకు రక్తహీనత


ఏరియా వైద్యశాలలో గర్భిణులు

- పౌష్టికాహారం తీసుకోవడంలో నిర్లక్ష్యం
- పుట్టబోయే బిడ్డపై ప్రభావం
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు..

సత్తెనపల్లి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహార లోపం గర్భిణుల్లో అధికమవుతోంది. ఏరియా వైద్యశాలల్లో పరీక్షలకు వచ్చే గర్భిణులు అధికంగా మైల్డ్ ఎనీమియాతో బాధ పడుతున్నారు. వైద్య పరీక్షలకు వచ్చే 12 శాతం మందిలో మాత్రమే సాధారణ స్థాయి కంటే అధికంగా హిమోగ్లోబిన్ ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ఒకటి రెండు శాతం మంది సివియర్ ఎనీమియాతో బాధ పడుతున్నట్లు వెల్లడిస్తున్నారు.

రక్తహీనత నిర్ధారణ ఇలా..

హిమోగ్లోబిన్ పరీక్ష ద్వారా రక్త హీనతను నిర్ధారిస్తారు. హిమోగ్లోబిన్ 11 గ్రాములు ఉంటే సమస్య లేనట్లే. అంతకంటే తక్కువగా ఉంటే రక్త హీనతతో బాధ పడుతున్నట్లు గుర్తించాలి. సివీరియర్ ఎనీమియాతో బాధపడే గర్భిణుల్లో హిమోగ్లోబిన్ శాతం ఏడు గ్రాములు కంటే తక్కువ. ఇది అత్యంత ఇబ్బంది కరం. ఈ తరం గర్భిణీల్లో హిమోగ్లోబిన్ శాతం ఏడు నుంచి 11 గ్రాముల మధ్య ఉంటుంది. దీనినే మైల్డ్ ఎనీమియాగా వైద్యులు చెబుతున్నారు. 60 శాతం మంది గర్భిణులు ఈ సమస్యతో బాధ పడుతున్నారు. గర్భ దాల్చిన తర్వాత తగిన పోషకాహారం తీసుకోక పోవడం వల్ల సమస్య ఉత్పన్నమవుతోంది.

ప్రధాన కారణం

రక్త హీనత బారిన పడటానికి ప్రధాన కారణం పోషకాహార లోపమేనని వైద్యులు చెపుతున్నారు. దీనివల్ల గర్భిణుల్లో అలసట, కళ్ల పాలి పోవటం, ఆయాసం, గుండె దడ వంటి లక్షణాలు కన్పిస్తాయి.

పోషకాహారంతో మేలు



పోషకాహారం తీసుకోవడం ద్వారా రక్త హీనత సమస్యకు చెక్ పెట్టవచ్చు. ప్రతి రోజు ఆహారంలో ఆకు కూరలు, మాంసం, డ్రైఫ్రూట్స్ పండ్లు తీసుకోవాలి. బెల్లం, చిక్కీలు వంటివి తీసుకోవటం ద్వారా కూడా రక్త హీనతకు గురికారు. వైద్యశాలకు వచ్చే గర్భిణుల్లో రక్త హీనతతో బాధపడే వారికి ఐరన్ టాబ్లెట్స్, ఐరన్ శుక్రోజ్ ఇంజక్షన్‌లు అందిస్తున్నాం.

-డాక్టర్ సుజాత, గైనకాలజిస్టు, ఏరియా వైద్యశాల, సత్తెనపల్లి

ప్రసవ సమయంలో ఇబ్బందులు



హిమో గ్లోబిన్ ఏడు గ్రాముల కంటే తక్కువగా ఉన్న గర్భిణులకు ప్రసవ సమయంలో ఇబ్బందులు ఎదురవుతాయి. పుట్టబోయే బిడ్డ బరువు, పెరుగుదల తక్కువగా ఉంటుంది. ఐరన్ లోపంతో బాధ పడే గర్భిణులకు ఐరన్ శుక్రోజ్ ఇంజక్షన్‌లు చేస్తున్నాం. ఐరన్ టాబ్లెట్లు అందిస్తున్నాం.

-డాక్టర్ లక్ష్మణరావు, సూపరింటెండెంట్, ఏరియా వైద్యశాల సత్తెనపల్లి

ముందు జాగ్రత్తలు అవసరం



గర్భిణుల్లో రక్తహీనతతో బాధ పడుతున్న వారి సంఖ్య పెరుగుతుంది. పోషకాహారం తీసుకోక పోవటం వల్ల ప్రతి పది మంది గర్భిణుల్లో ముగ్గురు రక్తహీనతతో బాధ పడుతున్నారు. రక్తహీనత సమస్య నివారణకు ముందస్తు చర్యలే మార్గం. పది నుంచి 19 ఏళ్ల లోపు బాలికల్లో రక్తహీనత నిర్ధారణ పరీక్షలు చేయాలి. అవసరమైన పోషకాహారం తీసుకోవడం వల్ల వివాహ సమయానికి ఇబ్బందులు లేకుండా ఉంటుంది.

- డాక్టర్ అరుణ, గైనకాలజిస్టు, ఏరియా వైద్యశాల, సత్తెనపల్లి

పుష్ప విలాపం!


గుంటూరు పూల మార్కెట్‌లో ఆరు బయట పార బోసిన బంతి, చేమంతి పూలు

- దసరా అనంతరం పూల ధరలు పతనం
- కిలో బంతి రూ.10, చేమంతి రూ.20

గుంటూరు సిటీ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): నిన్న మొన్నటి వరకు ఆకాశాన్నంటిన పూల ధరలు ఒక్కసారి ఢమాల్ అన్నాయి. పండుగ సీజన్ కిలో బంతి పూల ధర రూ.100 నుంచి రూ.120 వరకు పలికింది. గురువారం అదే బంతి పూలు కిలో రూ. 10 చొప్పున గుంటూరు బస్టాండ్ సమీపంలోని పూల మార్కెట్‌లో విక్రయించారు. పండుగ సమయంలో కిలో రూ.300 వరకు పలికిన చేమంతి ధర రూ. 50 నుంచి రూ.20కి పడిపోయింది. అంత తగ్గించి అమ్మినా కొనేవారు లేకపోవడంతో క్వింటాళ్ల కొద్దీ పూలను ఆరుబయట పారబోస్తున్నారు. చామంతి పూలను ఎక్కువగా బెంగళూరు నుంచి తెప్పించి ఇక్కడ విక్రయిస్తున్నారు. బంతి పూల సాగు గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఎక్కువగా ఉంది. ప్రస్తుతం గుంటూరు పూల మార్కెట్‌లో విక్రయించే బంతి పూలు స్థానికంగా దొరికేవి. ఒక్కసారిగా పూల ధరలు పాతాళానికి పడిపోవడంతో.. వ్యాపారులు ఆవేదన చెందుతున్నారు.



బంధిఖానాలో బాల్యం



గుంటూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఐదో జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం రాష్ట్రంలోని 20 నుంచి 24 ఏళ్ల మధ్య వయసున్న యువతుల్లో 29.3 శాతం మంది బాల్య వివాహాలు చేసుకుంటున్నారని తేలింది. ఇది జాతీ య సగటు 23 శాతం కంటే 6 శాతం అధికం. బాల్య వివాహం చేసుకున్న గ్రామీణ మహిళలు 32.9 శాతం ఉండగా, పట్టణ ప్రాంతాల్లో 21.7 శాతం మంది ఉన్నారు. వీరిలో 12.6 శాతం మంది 15 నుంచి 19 ఏళ్లలోపే గర్భం దాల్చారు.

జిల్లాల పునర్విభజన తర్వాత

- జిల్లాల పునర్విభజన తర్వాత ఒక్క గుంటూరు జిల్లాలోనే 2022లో 32, 2023లో 30 కేసులు నమోద య్యాయి. 2024లో 29 బాల్య వివాహాలు నమోదవగా వాటిలో 23 బాల్య వివాహాలను అధికారులు అడ్డుకున్నారు. 2025లో గడిచిన తొమ్మిది నెలల్లో 20 కేసులు రిపోర్టవగా 16 బాల్య వివాహాలను అధికారులు అడ్డుకున్నారు.
- పల్నాడు జిల్లాలో 2022, 2023లో 21, 2022లో 12, 2023లో 24, 2024లో 28, 2025లో ఇప్పటి వరకూ 20కి పైగా బాల్య వివాహాలను అధికారులు అడ్డుకున్నారు.
- బాపట్ల జిల్లాలో ఇప్పటి వరకు 29 బాల్య వివాహాలను అధికారులు అడ్డుకున్నారు. కాగా, 2024, 2025లో 58 బాల్య వివాహాలను అధికారులు ఆపగలిగారు. ఇది అధికారులు అడ్డుకున్న బాల్య వివాహాల లెక్క మాత్ర మే. అయితే క్షేత్ర స్థాయిలో ఈ సంఖ్య పదుల రెట్లు ఎక్కువగా ఉంటోందన్నది జగమెరిగిన సత్యం.

ఫిర్యాదు చేస్తేనే..

ఏదో ఒక వివాదం జరిగి, ఎవరైనా ఉద్దేశ పూర్వకంగా ఫిర్యాదు చేస్తే తప్ప బాల్య వివాహాల విషయం అధికారుల వరకూ రావడం లేదన్నది వాస్తవం. ఏది ఏమైనప్పటికీ గడిచిన నాలుగేళ్లలో బాల్య వివాహాల దురాచారం విపరీ తంగా పెరిగింది. గ్రామీణ ప్రాంతాల విషయం ఎలా ఉన్నా, పట్టణ ప్రాంతాల్లోనే ఈ మహమ్మారి జడలు విప్పి. కోరలు చాచి చిన్నారుల జీవితాలను వివాహ బంధనాల్లోకి లాగేయడం తిరోగమన సంకేతాలు ఇస్తోంది.

● వివిధ స్థాయిల్లో కమిటీలు..

బాల్య వివాహాలను అడ్డుకునేందుకు జిల్లా స్థాయిలో కలెక్టర్, డివిజన్ స్థాయిలో డివిజన్ అధికారి, సబ్ కలెక్టర్లు బాల్య వివాహ నిరోధక అధికారులుగా వ్యవహరిస్తారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సీడీపీవో ప్రాజెక్టు స్థాయిలో 3 నుంచి 5 మండలాలకు ఒక బాలల అభివృద్ధి ప్రాజెక్టు అధికారి, మండల స్థాయిలో సంబంధిత తహసీల్దార్ పనిచేస్తారు. గ్రామాల్లో సర్పంచి, పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, స్థానిక ఉపాధ్యాయురాలు, మహిళా వార్డు మెంబర్లు, స్వచ్ఛంద సంస్థ, యువజన సమాఖ్య సభ్యుడు, ఆరోగ్య, అంగన్వాడీ కార్యకర్తలు బాల్య వివాహ నిరోధక కమిటీలో సభ్యులుగా ఉంటారు. వీరంతా బాల్య వివాహల వల్ల కలిగే నష్టాలను ఆయా ప్రాంతాల్లో తెలియజేస్తూ.. తల్లిదండ్రుల్లో అవగా హన పెంచుతారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగు తుంటే అడ్డుకుంటారు. ఈ కమిటీలు నామమాత్రంగా మారిన కారణంగానే బాల్య వివాహాల సంఖ్య ఇటీవల ఆందోళనకర స్థాయిలో పెరుగుతోంది. బాల్య వివాహాలపై ఐసీడీఎస్ కృషి చేస్తున్నప్పటికీ అది ఏమాత్రం సరిపోవడం లేదన్నది గణాంకాల ద్వారా వెలికి తెలుస్తున్న వాస్తవం!

● భయమే కారణమా?

గ్రామాలు, ఏజెన్సీ ప్రాంతాల్లో బాల్య వివాహాలు జరగడానికి కారణం అవిద్య, అవగాహనాలేమి కారణాలుగా కనిపిస్తున్నాయి. పట్టణ ప్రాంతాల్లోని తల్లిదండ్రుల సమస్య వేరేలా ఉంటోంది. సినిమా, టీవీల దుష్ప్రభావాలు, లైంగిక వేధింపులు, అత్యాచారాల నుంచి బయట పడేందుకు తక్కువ వయసులో పెళ్లిళ్లకు పూనుకుంటున్నారు. సమాజాన్ని ఆవరించిన అభద్రతా భావం ఆడపిల్లలకు శాపంగా మారింది. ప్రజల్లో అవగాహన పెంచి, భయం పోగొట్టి, మహిళలకు, ఆడపిల్లల భద్రతకు భరోసా ఇచ్చేలా ప్రభుత్వం చొరవ తీసుకుంటే తప్ప ఈ బాల్య వివాహాలు అడ్డుకోవడం కష్టమని నిపుణులు చెబుతున్నారు.

బాల్య వివాహాలతో నష్టాలెన్నో..

- శారీరక, మానసిక ఎదుగుదల దెబ్బతింటుంది.
- పరిపూర్ణ వ్యక్తులుగా ఎదిగేందుకు అవకాశం, స్వేచ్ఛ ఉండదు.
- చిన్న వయసులోనే గర్భధారణ తల్లీబిడ్డకు ప్రమాదం.
- తక్కువ బరువుతో శిశు జననం , పౌష్టికాహార లోపం, రక్తహీనత వంటి ఆరోగ్య సమస్యలు వస్తాయి.
- బాలికా విద్యా హక్కును ఇది కాలరాస్తుంది. పిల్లలు నిరక్షరాస్యులుగా, నైపుణ్యం లేనివారుగా మిగిలిపోతారు.

బస్సుకి బలమిచ్చిన..స్త్రీశక్తి!



- మరమ్మతులకు ముందస్తు చర్యలు
- గ్యారేజ్‌లలో అందుబాటులో పరికరాలు
- గతంలో రోజుకు మూడు సర్వీసులు బ్రేక్‌డౌన్
- నేడు అడపాదడపా మాత్రమే..

గుంటూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): డొక్కు బస్సులు, పెద్ద శబ్దాలతో ప్రయాణికులను సైతం ఇబ్బందులకు గురిచేసే బస్సులు, బస్సులకు మరమ్మతులు చేయాలన్నా గ్యారేజ్ సిబ్బందికీ తలకు మించిన భారం ఇదంతా గతంలో ఆర్టీసీ ఎదుర్కొన్న పరిస్థితి. ప్రస్తుతం ఆర్టీసీ గ్యారేజ్‌లలో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్త్రీ శక్తి పథకం ఆర్టీసీకి కూడా దన్నుగా నిలుస్తోంది. స్త్రీ శక్తి పథకం అమలుతో ఆర్టీసీ గ్యారేజ్‌లలో కూడా పరిస్థితులు మెరుగుపడ్డాయి. ఎప్పటికప్పుడు బస్సులకు కావాల్సిన పరికరాలను అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ఇప్పటికే డిపోల్లో నిబంధనలకు అనుగుణంగా తిరిగిన స్క్రాబ్ చే స్తున్నారు. బస్సులను తొలగించి వాటి స్థానంలో కొత్తగా ఎలక్ట్రికల్ బస్సులను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఇదిలా ఉంటే గతంలో బస్సులు మార్గ మధ్యంలో నిలిచిపోవడంతో ప్రయాణికులు రోడ్లపైనే నిల్చొని అదే మార్గంలో వచ్చే వేరొక బస్సు లు ఎక్కాల్సి వచ్చేది. అంతేగాక టైర్లు పంక్చర్‌లు పడటం, బానెట్‌లలో సమస్యలు, ఇంజన్‌లో సాంకేతిక సమస్యలు వచ్చి బస్సులు నిలిచి పోతుండేవి. మరో వైపు గ్యారేజ్‌లలో కూడా గతంలో అవసరమైన పరికరాలు కూడా ఉండేవి కాదు. దీంతో గ్యారేజ్ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడేవారు. స్త్రీశక్తి పథకం అమలుతో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి.

అడపా దడపానే సమస్యలు

డిపోల్లో గతంతో పోల్చితే బస్సుల్లో సాంకేతిక సమస్యలు, బ్రేక్ డౌన్‌లు రావడం అడపా దడపా ఉంటున్నాయని సిబ్బంది చెబుతున్నారు. అంతేగాక గ్యారేజ్‌లలో అవసరానికి అనుగుణంగా సామగ్రి కూడా అందుబాటులో ఉంచుతున్నారు. స్త్రీ శక్తి పథకం అమలు నేపథ్యంలో ముందుగానే డిపోల్లో బస్సులను పూర్తిగా తనిఖీలు చేసి అందుబాటులో ఉంచుతున్నారు.

స్త్రీశక్తి పథకంపై అలసత్వం చూపొద్దు : ఆర్టీసీ ఈడీ

గుంటూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్త్రీ శక్తి పథకంపై ఎవరూ అలసత్వం చూపొద్దని ఆర్టీసీ జోనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈడీ) రాజేంద్రప్రసాద్ సూచించారు. గుంటూరు ఎన్టీఆర్ బస్టాండ్‌లోని తిక్కన సమావేశ మందిరంలో గురువారం డీపీటీవోలు, ఇతర అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా స్త్రీ శక్తి పథకం అమలుపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించదన్నారు. ఈ పథకం అమలుతో ఆర్టీసీలో మహిళల రద్దీ మరింత పెరిగిందన్నారు. మహిళల రద్దీకి అనుగుణంగా ఆయా రూట్లను పరిశీలించి అవసరమైతే ట్రిప్పులను పెంచుకోవాలన్నారు. ప్రయాణి కుల అవసరాలను అనుగుణంగా సర్వీసులు ఏర్పాటు చేయాలని సూచించారు. అలానే బస్టాండ్ ఆవరణలో ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదే శాలు జారీ చేశారు. ఈ సందర్భంగా డిపోల వారీగా ఆదాయ, వ్యయాల వివరాలను సమీక్షించారు. సమావేశంలో డీపీటీవోలు సీహెచ్ విమల (గుంటూ రు), సామ్రాజ్యం (బాపట్ల), అజిత కుమారి (పల్నాడు), జి.సత్యనారాయణ (ఒంగోలు), షేక్ షమీమ్ (నెల్లూరు), డిప్యూటీ సీటీఎం ఎం.రవికాంత్, డిప్యూటీ సీఎంఈ కె.సత్యనారాయణ తదితరులున్నారు.


మాట్లాడుతున్న ఆర్టీసీ ఈడీ నాగేంద్రప్రసాద్, హాజరైన డీపీటీవోలు

సహాయక చర్యలకు ఎల్లప్పుడూ సంసిద్ధం

- ఎన్‌డీఆర్‌ఎఫ్, సివిల్ డిఫెన్స్ బృందాలు అప్రమత్తం
- మాక్ డ్రిల్‌లో రైల్వే డీఆర్‌ఎం సుధేష్ణ సేన్

పెదకూరపాడు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రమాదాలు జరిగిన వెంటనే ఎన్‌డీఆర్‌ఎఫ్, సివిల్ డిఫెన్స్ బృందాలు అప్రమత్తమై సహాయక చర్యలు చేపడతాయని సౌత్ సెంట్రల్ రైల్వే గుంటూరు డివిజన్ డీఆర్ఎం సుదేష్ణసేన్ తెలిపారు. పెదకూరపాడు రైల్వే స్టేషన్‌లో గురువారం ప్రమాదాల సమయంలో సహాయక చర్యలపై మాక్ డ్రిల్ నిర్వహించారు. రైల్వే వ్యాగిన్ పట్టాలు తప్పడం, మంటలు వ్యాప్తి చెందినప్పుడు అదుపు చేసే విధానంపై ప్రతి ఆరు నెలలకోసారి మాక్‌డ్రిల్‌ను నిర్వహిస్తామని డీఆర్ఎం వివరించారు. పట్టాలు తప్పిన కోచ్‌లలో మంటలు చెలరేగినప్పుడు ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీసుకురావడం, అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసి, ప్రయాణికులకు తాత్కాలిక వైద్య సేవలు అందించడం, వాణిజ్య శాఖ సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రయాణికుల వివరాలను పరిశీలించి బంధువులకు సకాలంలో సమాచారం అందించడం.. వంటివి చేశారు. పట్టాలు తప్పిన కోచ్‌లను మెకానికల్ సీడబ్ల్యూ విభాగం తిరిగి క్రమ పద్ధతిలో అమర్చింది. టెలికమ్యూనిషన్ విభాగం నిరంతర ప్రకటనలతో ప్రజలను, ప్రయాణకులను, సిబ్బందిని అప్రమత్తం చేసింది. ఏఆర్‌టీ, ఎంఆర్‌వీల బృందాలు నిర్ణీత సమయంలోనే అప్రమత్తమై ఘటనా స్థలానికి చేరుకొని ప్రదర్శించిన మాక్ డ్రిల్ విజయవంతమైంది. ఎన్‌డీఆర్ఆర్ఎఫ్, రాష్ట్ర అగ్నిమాపక సేవలు, రైల్వే విభాగాలతో సహా మాక్‌డ్రిల్‌లో ప్రదర్శించిన పని తీరును డీఆర్ఎం ప్రశంచారు. సీఆర్ఎస్ఈ కమల్‌కాంత్, డిప్యూటీ సీఎస్‌వో ఎం కిషోర్, సౌత్ సెంట్రల్ సీనియర్ అధికారులు ఈ మాక్ డ్రిల్‌ను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో సీఎంఎస్ హెల్త్ యూనిట్ వైద్యులు డాక్టర్ శ్రీనివాస్, సీనియర్ డీవోఎం శ్రీనాథ్, సీనియర్ డీఈఈ రవితేజ, సీనియర్ డీసీఎం ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.


గాయపడిన వ్యక్తిని చికిత్స కోసం తరలిస్తున్న దృశ్యం


ప్రమాదానికి గురైన రైల్వే బోగీ నుంచి గాయపడిన వారిని కిందకు దించుతున్న సిబ్బంది

25 మందితో సీబీఐసీ పెన్షనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

గుంటూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా పెన్షనర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ ట్యాక్స్ అండ్ కస్టమ్స్ (సీబీఐసీ), ఆంధ్రప్రదేశ్ యూనిట్ 25 మందితో రాష్ట్ర నూతన కార్యవర్గం ఏర్పడింది. గుంటూరులోని రింగ్ రోడ్డు వద్ద ఉన్న కస్టమ్స్, జీఎస్టీ అప్పీల్స్ కార్యాలయంలో గురువారం పెన్షనర్ల సంఘం రాష్ట్రస్థాయి ఎన్నిక, సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్ష పదవికి గుంటూరుకు చెందిన టి.వివేకానందను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా విజయవాడకు చెందిన గద్దె తిలక్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఎం.దేవరాజన్(తిరుపతి), బి. రాజేశ్వరరావు(గుంటూరు), ఎ.సత్యనారాయణ (రాజమండ్రి), పర్వతనేని ప్రసాద్ (విజయవాడ) ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శి పదవికి పీవీ సత్యనారాయణ(గుంటూరు), పి. భీమ్ ప్రసాద్ (ఏలూరు), కేవీ అప్పలాచార్యులు (కాకినాడ), పీవీపీ నరసింహం (వైజాగ్) ఎన్నికయ్యారు. కోశాధికారిగా పి.కోటేశ్వరరావు (గుంటూరు), సీజీహెచ్ఎస్ ఏపీ కొ-ఆర్డినేటర్‌గా గుమ్మడి సీతారామయ్య చౌదరి (గుంటూరు), విజయవాడ కో- ఆర్డినేటర్‌గా పి. భాగ్యరావు (విజయవాడ), మహిళా రిప్రెజెంటేటివ్‌గా కె.సాంబ్రాజ్యం (గుంటూరు) పదవులు దక్కించుకున్నారు. సర్కిల్ సెక్రటరీలుగా ఎన్ఎస్ నగేష్‌బాబు, పి.భాగ్యరావు, ఎస్‌కె హుస్సేన్, టి వెంకట్రావు, ఎం.వినోద్ కుమార్, ఇక్రముల్లా షా, ఇనయతుల్లా ఎన్నికయ్యారు. సంఘం గౌరవాధ్యక్షుడిగా సెంట్రల్ ఎక్సైజ్ శాఖ విశ్రాంత చీఫ్ కమిషనర్ సీవీరావు, గౌరవ సలహాదారులుగా విశ్రాంత అసిస్టెంట్ కమిషనర్లు బి.సీతారామయ్య, పీవీ రమణమూర్తి, నర్రా వెంకటేశ్వర్లును సభ్యులు ఎన్నుకున్నట్లు తెలిపారు. ఎన్నికల అధికారులుగా జీఎస్టీ సూపరింటెండెంట్లు కేపీ సాగర్, ఎం.గిరిబాబు వ్యవహరించారు. నూతన కార్యవర్గం రెండేళ్ల పాటు పనిచేస్తుంది. సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సుజిత్ మల్లిక్, విశ్రాంత చీఫ్ కమిషనర్ బి. హరే రామ్, అఖిల భారత కస్టమ్స్ జీఎస్టీ ఉద్యోగ సంఘ నాయకులు అభినందనలు తెలిపారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

సదరన్ పవర్ చైర్మన్‌గా పూర్వ కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా పూర్వ కలెక్టర్ శివశంకర్ లోతేటి సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు విడుదల చేసింది. తెలంగాణ క్యాడర్ కింద శివశంకర్‌ను గతంలో బదలీచేసిన విషయం తెలిసిందే. ఈ అంశంపై కోర్టులో పిటిషన్ దాఖలుచేసి గెలుపొందారు. కోర్టు ఉత్తర్వుల మేరకు అయన ఇటీవల తెలంగాణ నుంచి ఏపీ క్యాడర్‌కు వచ్చారు. కొద్ది రోజులుగా పోస్టింగ్ కోసం వేచి ఉన్నారు. ఐఏఎస్‌ల ప్రస్తుత బదలీల్లో లోతేటిని సదరన్ పవర్ చైర్మన్‌గా ప్రభుత్వం నియమించింది. పల్నాడు జిల్లా తొలి కలెక్టర్‌గా శివ శంకర్ పనిచేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నరసరావుపేట లీగల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల కారణంగా శుక్రవారం పట్టణంలోని గుంటూరు రోడ్, క్రిస్టియన్‌పాలెం, పనసతోట, నిమ్మతోట, మార్కెట్ ప్రాంతంలలో ఉదయం 8 గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు డీవన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

బాణసంచా దుకాణాలలో తనిఖీలు

చిలకలూరిపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న దీపావళి మందుల దుకాణాలలో రూరల్ సీఐ బి.సుబ్బానాయుడు, రూరల్ ఎస్ఐ జి.అనిల్‌కుమార్ గురువారం తనిఖీలు నిర్వహించారు. నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అంబేడ్కర్ విగ్రహానికి నిప్పుపెట్టడం దారుణం: ఎంపీపీ రామారావు

రొంపిచర్ల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా ఎదురుకుప్పం మండలం దేవళంపేటలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టించిన ఘటన దారుణమని మాజీ ఎంపీపీ మొండితోక రామారావు పేర్కొన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీకి చెందిన సర్పంచ్ గోవిందయ్య ఈ ఘటనకు పాల్పడినట్టు పోలీసులు నిర్ధారించారన్నారు. దళితుల పక్షపాతి అని చెప్పుకొనే జగన్‌మోహన్‌రెడ్డి ఇటువంటి చర్యలను ప్రోత్సహించటం విడ్డూరంగా ఉందన్నారు. మండల తెలుగు యువత అధ్యక్షుడు బాల మురళీకృష్ణ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి కల్లబొల్లి ప్రేమను వలకబోస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు పాల్గొన్నారు.

వేల్పూరి వాసి నేత్రదానం


హనుమంతరావు (ఫైల్‌ఫొటో)

వేల్పూరు (శావల్యాపురం) అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేల్పూరు గ్రామానికి చెందిన సూరాబత్తుని హనుమంతరావు (58) అనారోగ్యంతో గురువారం మృతిచెందగా ఆయన కుటుంబసభ్యులు మృతుని నేత్రాలు దానం చేశారు. అమ్మ నేత్ర, అవయవదాన ప్రోత్సాహకుల సంఘం జిల్లా కో-ఆర్డినేటర్ సంద్రపాటి చలపతిరావు సమాచారంతో పెదకాకానిలోని శంకర్ ఆసుపత్రికి చెందిన ఐ-బ్యాంక్ సిబ్బంది కార్నియా పొరలను సేకరించారు.

క్లుప్తంగా...

● నాదెండ్ల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): నల్లబర్లీ పొగాకు సాగుపై ప్రభుత్వం నిషేధం విధించినందున ఎవరైనా రైతులు సాగుచేస్తే పంటను ధ్వంసం చేస్తామని ఇన్‌చార్జ్ తహసీల్దార్ షేక్ సల్మాన్ హెచ్చరించారు. నాదెండ్లలో పొగాకు సాగు చేయవద్దని రైతులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

● రొంపిచర్ల: మండలంలోని గోగులపాడులో నల్లబర్లీ సాగు నిషేధంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నిర్మల, వ్యవసాయ శాఖ అధికారి శివలలిత, వైద్యాధికారి ప్రసాదునాయక్ పాల్గొన్నారు.

● నరసరావుపేట రూరల్: నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఆల్ ఇండియా థాల్ సైనిక్ క్యాంప్‌లో ప్రతిభ కనబర్చిన క్యాడెట్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకటకోటేశ్వరరావు, ప్రిన్సిపాల్ వై.వెంకటేశ్వర్లు, మేజర్ వై.అంజిరెడ్డి మేజర్ బీఎస్ఆర్‌కే రాజు, సుబేదార్ బల్విందర్‌సింగ్, హవల్దార్ శంషార్‌సింగ్ పాల్గొన్నారు.

● వినుకొండ టౌన్: వినుకొండ ప్రాంతంలో సాంస్కృతిక సంస్థ కళాసాగరి 5వ వార్షికోత్సవం సందర్భంగా వినుకొండ రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ వినుకొండ వారి సౌజన్యంతో ఈ నెల 19న, జాషువా కళా ప్రాంగణంలో రాష్ట్రస్థాయి సినీ గీతాల పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. వివరాల కోసం 9581853636ను సంప్రదించాలన్నారు.

● వినుకొండ టౌన్: పట్టణంలోని గవర్నమెంట్ హాస్పిటల్‌లో జీఎస్టీ తగ్గింపుపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో గవర్నమెంట్ హాస్పటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి, హెడ్ నర్స్, స్టాఫ్ నర్స్ శివ గంగ, ఫార్మసిస్టు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

● బొందిలిపాలెం (శావల్యాపురం): మండలంలోని బొందిలిపాలెంలోని మెయిన్, బీసీకాలనీ ప్రాథమిక పాఠశాలలను ఎంఈవో మద్దిగుంట్ల సాంబశివరావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హెచ్ఎంలు రామచంద్రారెడ్డి, రబియా, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

● నరసరావుపేట రూరల్: మండలంలోని ఇసప్పాలెం మహంకాళి అమ్మవారి దేవాలయ పునర్నిర్మాణానికి మదిరకు చెందిన రామ్‌భూపాల్‌రెడ్డి, సుమ ప్రతిమ, ఈశాన్‌రెడ్డిలు రూ.లక్ష రూపాయల వితరణ ఇచ్చారు. ఆలయ ఈవో మాధవి లతకు ఈ చెక్కును గురువారం అందించారు.

● రొంపిచర్ల: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో దివ్యాంగుడైన సాగర్‌బాబుకు న్యాయం చేయాలని రాష్ట్ర పీడీఎం నాయకుడు వై.వెంకటేశ్వరరావు, రాష్ట్ర గిరిజన సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు వీ కోటా నాయక్ నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ నిర్మలకు వినతిపత్రం అందజేశారు. సాగర్‌బాబు చేస్తున్న దీక్ష 27వ రోజుకు చేరింది.

ఉత్సాహంగా మండల స్థాయి క్రీడా పోటీలు


యడ్లపాడు: వాలీబాల్ పోటీలలో ప్రథమస్థానం సాధించిన జట్టుతో ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు

యడ్లపాడు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంఈవో నాగరత్నం అన్నారు. మండలంలోని సొలస జిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో మండలస్థాయి క్రీడా పోటీలు, క్రీడాకారుల ఎంపికలు గురువారం జరిగాయి. అండర్-14, అండర్-17 విభాగాలలో కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్‌తోపాటు యోగా, చెస్ అంశాలలో బాల బాలికలకు వేర్వేరుగా పోటీలను నిర్వహించారు. మండంలోని ఉన్నత, యూపీ పాఠశాలలకు చెందిన 300మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

వాలీబాల్ అండర్-17 విభాగంలో లింగారావుపాలెం జడ్పీ హైస్కూల్, అండర్-14 విభాగంలో వంకాయలపాడు జడ్పీ హైస్కూల్, బాలికల అండర్-17 విభాగంలో సొలస జడ్పీ హైస్కూల్, అండర్-14 విభాగంలో కారుచోల జడ్పీ హైస్కూల్‌లు ప్రథమ స్థానంలో నిలిచాయి. బాలికల ఖోఖో అండర్-17, అండర్-14 విభాగాలు రెండింటిలోనూ సొలస జడ్పీ హైస్కూల్ విద్యార్థినులు తమ సత్తాను చాటి జట్లను ప్రథమ స్థానంలో నిలిపారు. కాగా అథ్లెటిక్స్ వ్యక్తిగత విభాగాలలో ఉన్నవ, సొలస, జగ్గాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు సత్తాచాటగా, యోగాలో లింగారావుపాలెం జడ్పీ హైస్కూల్, చెస్‌లో వంకాయలపాడు జడ్పీ హైస్కూల్ ప్రథమ స్థానంలో నిలిచాయి.

ఆయా పోటీలలో విశేష ప్రతిభను చూపిన క్రీడాకారులను హెచ్ఎం ఎ.వెంకటేశ్వరరావు, గ్రామపెద్దలు వీరారెడ్డి, శ్రీనివాసరెడ్డి, విజయ బాలచంద్రారెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ నాగళ్ళ శ్రీకాంత్‌లు అభినందించారు. పోటీలను జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల గౌరవాధ్యక్షుడు పాల్ సుధాకర్, యడ్లపాడు మండల ఎస్‌జీఎఫ్ కో-ఆర్డినేటర్ మధుబాబు, వ్యాయామ ఉపాధ్యాయులు రాజేష్, శ్రీధర్, శ్రీనివాసరావు, కిషన్, మేరీశౌరీలు, అసితున్, రమాదేవి, వేమారెడ్డి, అనూజి పర్యవేక్షించారు.

● రొంపిచర్ల: స్థానిక జడ్పీ పాఠశాలలో రెండు రోజుల నుంచి జరుగుతున్న మండల స్థాయి క్రీడా పోటీలు గురువారంతో ముగిశాయి. పల్నాడు జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహించారు. రన్నింగ్, లాంగ్ జంప్, హైజంప్, షటిల్ బాడ్మింటన్ పోటీలను నిర్వహించినట్లు ఫిజికల్ డైరెక్టర్ సైదయ్య తెలిపారు. మండలంలోని ఫిజికల్ డైరెక్టర్లు రమాదేవి, పుల్లయ్య, రామాంజనేయులు తదితరులు క్రీడా పోటీలను పర్యవేక్షించారు.

● నూజెండ్ల: మండల కేంద్రం నూజెండ్లలో రెండు రోజుల పాటు నిర్వహించిన స్కూల్ గేమ్స్ గురువారం ముగిశాయి. వాలీబాల్ అండర్-14, 17 బాలుర, మహిళలలో జడ్పీ పాఠశాల నూజెండ్ల గెలుపొందాయి. కబడ్డీలో జడ్పీ పీఎస్ నూజెండ్ల, కంభంపాడు జడ్పీపీహెచ్ఎస్, సీతారామపురం వెంకటేశ్వరస్వామి కమిటీ హైస్కూల్, ఖోఖోలో ఉప్పలపాడు గురుకుల పాఠశాల, నూజెండ్ల జెడ్పీహెచ్ఎస్, అదేవిధంగా అథ్లెటిక్స్‌లో విద్యార్థులు, జట్లను డివిజన్ స్థాయి ఆటలకు ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పీ ఉమాదేవి, ఎంఈవోలు కే సత్యనారాయణ, ఎన్ రవిచంద్ర, హెచ్ఎం శ్రీదేవి, స్కూల్ గేమ్స్ సెక్రటరీ ఎన్‌వీ రత్నం విద్యార్థులను అభినందించారు.

● పోట్లూరు (శావల్యాపురం): దాతల సహకారం అభినందనీయమని హెచ్ఎం సింగంశెట్టి అన్నపూర్ణమ్మ అన్నారు. రిటైర్డ్ ఉపాధ్యాయులు, రోటరీ క్లబ్ మెంబర్ గాండ్ల నాగేంద్రుడు తల్లిదండ్రుల జ్ఞాపకార్థం పోట్లూరు జడ్పీ పాఠశాల విద్యార్థులకు 30 జతల క్రీడాదుస్తులను గురువారం హెచ్ఎం, పీడీలకు అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ జోనల్ చైర్మన్‌లు ఆలా శ్రీనివాసరావు, చిరుమామిళ్ళ కోటేశ్వరరావు, ముత్తినేని గిరిబాబు, వినుకొండ రోటరీ క్లబ్ అడ్మినిస్టేటర్ కూచి రామాంజనేయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోధనేతర పనులు, విద్యాశక్తిని బహిష్కరిస్తున్నాం

● డీఈవోకు ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య వినతి


డీఈవో చంద్రకళకు వినతి పత్రం అందజేస్తున్న ఫ్యాప్టో నాయకులు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఫ్యాప్టో (ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య) అక్టోబరు 10 నుంచి బోధనేతర పనులు, విద్యాశక్తి కార్యక్రమంను బహిష్కరిస్తోందని ఫ్యాప్టో నాయకులు తెలిపారు. గురువారం ఈ మేరకు నరసరావుపేటలోని డీఈవో కార్యాలయంలో డీఈవో ఎల్ చంద్రకళకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మితిమీరిన బోధనేతర కార్యక్రమాల వలన బోధనా సమయం హరించుకుపోతుందన్నారు. ఉపాధ్యాయులకు కూడా బోధనపై ఆసక్తి తగ్గిపోయే విధంగా బోధనేతర కార్యక్రమాలు పెరిగిపోయాయని ఆరోపించారు. పలు దఫాలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా ఏమాత్రం పట్టించుకోనందున అక్టోబరు 7న విజయవాడ ధర్నా చౌక్‌లో ఫ్యాప్టో ఆధ్వర్యంలో జరిగిన పోరుబాటలో బోధనేతర పనులను అక్టోబరు 10 నుంచి బహిష్కరించాలని నిర్ణయించిందన్నారు. ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్నభోజన పథకంనకు సంబంధించిన పనులు మాత్రమే ఉపాధ్యాయులు చేపడతారన్నారు. మూల్యాంకనానికి సంబంధించిన పరీక్షల నిర్వహణ తప్ప ఏ ఇతర బోధనేతర పనులను గాని, అనవసరమైన గూగుల్ షీట్స్ నింపడం గాని, విద్యాశక్తి, జీఎస్‌టీ 2.0 లాంటి సీజనల్ ప్రచార కార్యక్రమాలను చేపట్టబోమని చెప్పారు. కార్యక్రమంలో ఫ్యాప్టో డిప్యూటీ సెక్రటరీ జనరల్ ఎం. మోహన్‌రావు, ఎండీ ఉస్మాన్, చంద్రజిత్ యాదవ్, కే శ్రీనివాసరెడ్డి, టీ వెంకటేశ్వర్లు, కే కరిముల్లా, ఈ ఏమండీ, పీవీ భీష్మరావు, ఎస్సీ, ఎస్టీ సంఘం తరపున కే వీరాంజనేయులు, ఏడుకొండలు, రామయ్య, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● చిలకలూరిపేట: బోధనేతర పనులను తక్షణం బహిష్కరిస్తున్నట్లుగా చిలకలూరిపేట మండల విద్యాశాఖ అధికారి వీవీఎస్ చంద్రకళకు చిలకలూరిపేట ప్రాంత ఉపాధ్యాయులు గురువారం తెలిపారు. విజయవాడలో చేసిన ఫ్యాప్టో తీర్మానం మేరకు ఈ వివరాలతో వారు ఒక వినతిపత్రం ఎంఈవోకు అందచేశారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు మేకల కోటేశ్వరరావు, వడ్లాన జయప్రకాష్, షేక్ మస్తాన్ వలి, వీ రమణ నాయక్, అనిల్, పోటు శ్రీనివాసరావు పాల్గొన్నారు

బంగారు కుటుంబాల ఎంపిక నిష్పక్షపాతంగా ఉండాలి

డ్వామా పీడీ సిద్దలింగమూర్తి


శావల్యాపురంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ లింగమూర్తి

శావల్యాపురం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పీ4లో భాగంగా బంగారు కుటుంబాలను ఎంపిక చేసేప్పుడు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని డ్వామా పీడీ సిద్దలింగమూర్తి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పీ4 సిబ్బందితో గురువారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. డ్వామా పీడీ మాట్లాడుతూ నియోజకవర్గంలో మొత్తం 6వేలు బంగారు కుటుంబాలను ఎంపిక చేయాల్సి ఉందన్నారు. శావల్యాపురం మండలంలోని 11 సచివాలయాల నుంచి 1632 బంగారు కుటుంబాలను ఎంపిక చేశారని, వారిలో పునఃపరిశీలనచేసి నిజమైన అర్హతలున్నవారిని మాత్రమే గుర్తించాలన్నారు. బంగారు కుటుంబాల ఎంపిక పూర్తయితే అన్ని గ్రామాల్లో గ్రామసభలు పెట్టి జాబితాను వెల్లడించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ఓఎస్‌డీ వరదా సుబ్బారావు మాట్లాడుతూ బంగారు కుటుంబాల జాబితాలపై పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవోలు సంతకాలు చేసి వచ్చే మంగళవారం సాయంత్రానికల్లా చీఫ్‌విప్ కార్యాలయానికి అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సీతారామయ్య, ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవో యాకోబు, పీ4మండల రిసోర్స్‌పర్సన్ సుజాత పాల్గొన్నారు.


● నూజెండ్ల: పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం చేపట్టిన పీ-4 విధానం మంచి ఫలితాలు ఇస్తుందని జిల్లా డ్వామా పీడీ సిద్దలింగమూర్తి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో గురువారం పీ-4 లబ్ధిదారుల ఎంపికపై మండల స్థాయి అధికారులు, ప్రభుత్వ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ వరద సుబ్బారావు, ఎంపీడీవో పీ ఉమాదేవి, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి ఎన్‌టీఆర్ వైద్య సేవలు నిలిపివేస్తున్నాం

● ఆంధ్రప్రదేశ్ స్పెషల్ హాస్పటల్ అసోసియేషన్


ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఏఎస్‌హెచ్ఏ నాయకులు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎన్‌టీఆర్ వైద్య సేవలు శుక్రవారం నుంచి జిల్లా, రాష్ట్ర వ్యాప్తంగా నెట్‌వర్క్ హాస్పటల్స్‌లో నిలిపివేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ స్పెషల్ హాస్పటల్ అసోసియేషన్ తెలియజేసింది. గురువారం ఈ మేరకు నరసరావుపేట పట్టణంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుకు వినతిపత్రం అందజేశారు. గత నెల 25న ఎన్‌టీఆర్ వైద్యసేవ ట్రస్టుకు తెలియజేశామని ఏఎస్‌హెచ్ఏ నాయకులు తెలిపారు. ఎన్‌టీఆర్ వైద్య సేవకు నిధులు మంజూరు కాకపోవడంతో ఆసుపత్రులు ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని అన్నారు. ప్రస్తుతం బకాయిలు రూ.2700 కోట్లుకు చేరాయని, ఇందులో రూ.670 కోట్లు సీఈవో ఆమోదం పొందినప్పటికి విడుదల కాలేదన్నారు. నిధులు తక్షణం విడుదల చేయకపోతే శుక్రవారం నుంచి ఎన్‌టీఆర్ వైద్య సేవ కింద సేవలు నిలిపివేయనున్నట్లు తెలిపారు.




సదస్సులో మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ డాక్టర్ ప్రసూన

దృష్టిలోప నివారణపై అవగాహన సదస్సు

నరసరావుపేట లీగల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా వైద్యశాలలో గురువారం 26వ ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా దృష్టిలోప నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ రవి మాట్లాడుతూ సమాజంలో నేత్ర సమస్యలు అధికంగా ఉన్నాయని, విద్యార్థులలో కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ ప్రసూన, జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ భువనేశ్వర్, వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సురేష్ సిబ్బంది మురళీకృష్ణ, రామకృష్ణ, ఏరియా వైద్యశాల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కబడ్డీ, బ్యాడ్మింటన్ స్టేట్ టీమ్‌కు వాగ్దేవి విద్యార్థులు ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో రాయల శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ ఓగూరి నాగేశ్వరరావు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): అండర్-19 కబడ్డీ, బ్యాడ్మింటన్ స్టేట్ టీమ్‌కు వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ ఓగూరి నాగేశ్వరరావు గురువారం తెలిపారు. తాడికొండలో ఈ నెల 8న ఎస్ఎస్‌బీ జూనియర్ కళాశాలలో జరిగిన అండర్-19 కబడ్డీ, ఈ నెల 7న సత్తెనపల్లిలోని మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో జరిగిన బ్యాడ్మింటన్ పోటీలలో ఈ ఘనత సాధించారన్నారు. బాలుర విభాగం కబడ్డీలో డీ త్రినాథ్, ఎస్.రమణయ్య, బ్యాడ్మింటన్‌లో షేక్ మహమ్మద్ నిస్సార్, బాలికల విభాగం కబడ్డీలో కే లక్ష్మీసరిత, కే అనూహ్య ఎంపిక అయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులు వినుకొండలో జరిగే స్టేట్ మీట్‌కి ప్రాతినిధ్యం వహిస్తారని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు తెలిపారు. విద్యార్థులను కళాశాల డైరెక్టర్లు కాట్ల రామకోటేశ్వరరావు, కపిలవాయి రాజేంద్రప్రసాద్, పాశం కృష్ణారావు, పీవీ అచ్యుతరావు, పీడీ రాయల ఆంజనేయులు అభినందించారు.

మ్యాక్స్ కేర్ సాయి తిరుమల వైద్యశాలలో అత్యాధునిక పరికరం


డాక్టర్ మన్నే గౌతమ్

నరసరావుపేట లీగల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మ్యాక్స్ కేర్ సాయి తిరుమల సూపర్ స్పెషాలిటీ వైద్యశాలలో జిల్లాలోనే ప్రథమంగా గ్యాస్ట్రోఎంటరాలజీ జబ్బుల నిర్ధారణకు అత్యాధునిక వైద్య పరికరం సాలిడ్ స్టేట్ మానోమీటరును ఏర్పాటు చేసినట్లు ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజీ నిపుణులు డాక్టర్ మన్నే గౌతం గురువారం తెలిపారు. ఈ పరికరం ద్వారా గ్యాస్ట్రో ఎంటరాలజీకి సంబంధించిన అనేక వ్యాధులను త్వరితగతిన ఖచ్చితంగా నిర్ధారించవచ్చునన్నారు. దీర్ఘకాలంగా మింగుడు పడటం ఇబ్బందిగా ఉండటం, తిన్నది గొంతులోనే ఉన్నట్లు అనిపించడం, తిన్న వెంటనే వాంతి అవడం, గుండె పట్టేసినట్లు ఉండడం తదితర సమస్యల నిర్ధారణకు ఈ ఆధునిక పరికరం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ అవకాశాన్ని పల్నాడు ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యశాల ఎండీ డాక్టర్ యనమదల శివప్రదీప్ కోరారు.

అంబేడ్కర్ ఆశయాల సాధన ఒక్క చంద్రబాబుతోనే సాధ్యం

● ఏపీ ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సాతులూరి కుమార్

నరసరావుపేట టౌన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఆశయాల సాధన ఒక్క చంద్రబాబు నాయుడుతోనే సాధ్యం అవుతుందని ఏపీ ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సాతులూరి కుమార్ అన్నారు. గురువారం నరసరావుపేటలోని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సాతులూరి కుమార్ మాట్లాడుతూ చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం దేవలపల్లిలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఆ గ్రామ సర్పంచ్ గోవిందయ్య, వైసీపీ నేతలు నిప్పు పెట్టి కూటమి నేతలు, ప్రభుత్వంపై రుద్దటం చాలా దుర్మార్గం అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని పక్కనపెట్టి రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేశారని, చంద్రబాబునాయుడు దళిత విద్యార్థులను విదేశాలకు పంపే పథకమైన అంబేడ్కర్ విదేశీ విద్యా పథకాన్ని జగన్‌మోహన్‌రెడ్డి పేరుమార్చి జగన్ విద్యాపథకంగా మార్చి యావత్ దళిత జాతిని అవమానించారని విమర్శించారు. దళితులు అభివృద్ధి చెందాలంటే చంద్రబాబునాయుడు, లోకేశ్, టీడీపీతోనే సాధ్యం అవుతుందన్నారు. సమావేశంలో పల్నాడు జిల్లా టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు జిల్లా ఎస్సీ ఉపాధ్యక్షుడు జీపీ కుమార్, అధికార ప్రతినిధి సీహెచ్ బాలు, నియోజకవర్గ ఎస్సీ నాయకులు గిద్దల వెంకటేశ్వర్లు, పట్టణ ఎస్సీల అధ్యక్షుడు కే సునీల్, జిల్లా కార్యదర్శి జొన్నలగడ్డ శ్యామ్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అలజడులకు జగన్ కుట్ర: టీడీపీ నాయకుల విమర్శ

చిలకలూరిపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లాలో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పుపెట్టిన ఘటనను చిలకలూరిపేట తెలుగుదేశం పార్టీ నాయకులు గురువారం విలేకరుల సమావేశంలో ఖండించారు. దళితులను రెచ్చగొట్టి రాష్ట్రంలో అలజడులు సృష్టించాలనే దురుద్దేశంతో ప్రత్యర్థులు ఇటువంటి పనులు చేస్తున్నారన్నారు. ఈ దారుణ ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, గత ప్రభుత్వంలో డాక్టర్ సుధాకర్‌బాబుపై దాడి జరిగినప్పుడు దళితులపై జరిగిన దాడులపై ఒక్కమాట కూడా మాట్లాడని నాయకులు ఇవాళ దళితులను ఉద్ధరించినట్టుగా మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. ఈ ఘటనలో జగన్‌ను కూడా ఏ2 నిందితుడిగా చేర్చాలని వారు డిమాండ్ చేశారు. దళితులపై దాడిచేసిన వారికి ప్రమోషన్ ఇచ్చి పక్కన కూర్చోబెట్టుకొని సెల్ఫీలు దిగిన జగన్ ఇప్పుడు దళితుల గురించి మాట్లాడుతుంటే ప్రజలు నమ్మే పరిస్థితి లేదని విమర్శించారు. సమావేశంలో టీడీపీ నాయకులు పఠాన్ సమద్‌ఖాన్, మద్దుమాల రవి, ఇనగంటి జగదీష్, కొండా వీరయ్య, పిల్లి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

అన్నవరప్పాడులో విగ్రహ ప్రతిష్ఠ పూజలు ప్రారంభం

రొంపిచర్ల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నవరప్పాడులో ఈ నెల 11వ తేదీన వినాయక, వెంకటేశ్వర తదితర విగ్రహ ప్రతిష్ఠ జరగనుంది. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో గురువారం ప్రతిష్ఠ పూజలు ప్రారంభమయ్యాయి.

రోడ్ల మరమ్మతులకు రూ.9 కోట్లు మంజూరు

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట నియోజకవర్గంలో మూడు ప్రధాన ఆర్అండ్‌బీ రోడ్ల మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.9కోట్ల మొత్తాన్ని మంజూరు చేసిందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు గురువారం తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రోడ్ల మరమ్మతులకు బుధవారం ప్రభుత్వం రూ.వెయ్యి కోట్లు విడుదల చేసిందని, ఇందులో భాగంగా నియోజకవర్గంలోని రోడ్లకు రూ.9 కోట్లు కేటాయించారని ఆయన ఎర్కొన్నారు పేర్కొన్నారు. దింతెనపాడు, సాతులూరు ఆర్‌బీ రోడ్డుకు రూ.5 కోట్లు, చిలకలూరిపేటలోని టిడ్కో గృహాల సమీపం నుంచి కమ్మవారిపాలెం, కట్టుబడివారిపాలెం మీదుగా యాటీ కూడలి వరకు ఉన్న రోడ్డుకు, వీ.ఎన్.పీ రోడ్డు నుంచి గణపవరం మీదుగా వేలూరు వరకు ఉన్న రోడ్డుకు కలిపి మరో రూ.4 కోట్లు కేటాయించినట్లు వివరించారు. ఈ నిధులతో రోడ్ల మరమ్మతులు, ప్యాచ్ వర్క్‌లు చేస్తారని పేర్కొన్నారు. ప్రజల విజ్ఞప్తులపై స్పందించి రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరుచేసిన ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబుకు నియోజకవర్గ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

పీపీపీ విధానం అభినందనీయం: డాక్టర్ ముప్పాళ్ళ

చిలకలూరిపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్ షిప్ ద్వారా మెడికల్ కళాశాలలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయమని టీడీపీ రాష్ట్ర వైద్యుల విభాగం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ముప్పాళ్ళ హనుమంతరావు గురువారం ఇక్కడ విలేకరుల సమావేశంలో అన్నారు. రాష్ట్రం త్వరితగతిన అభివృద్ధి చెందేందుకు ఈ విధానం సరియైనదన్నారు. మెడికల్ కళాశాలలను ట్రిపుల్ పీ పద్ధతిలో అభివృద్ధి చేస్తే పేదలకు కార్పొరేట్ వైద్యం చౌకగా లభిస్తుందని, స్థానికులకు ఉద్యోగ అవకాశాలు ఉంటాయని వివరించారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి మాత్రమే ఈ వైద్యశాలలు నడుస్తాయి కాబట్టి పేదలకు ఇప్పుడున్న సౌకర్యాలన్నీ ఉంటాయన్నారు. ఇంకా మెరుగైన సౌకర్యాలు కూడా ఉంటాయన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఎంతో ముందు చూపుతో ఈ పద్ధతి అమలుచేస్తున్నారని తెలిపారు. గడువు పూర్తయిన తర్వాత ఆ ఆస్తులన్నీ ప్రభుత్వ పరమవుతాయన్నారు. వైద్యశాలలలో సీట్ల భర్తీ ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఉంటాయి కాబట్టి ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఎలాంటి నష్టం జరగదన్నారు. దీనిపై ప్రతిపక్షాలు చెబుతున్నవన్నీ అవాస్తవాలని, ప్రజలు విజ్ఞతతో ఆలోచించాలని ఆయన కోరారు.

నాగోతు చిన్నమ్మకు ఎమ్మెల్యే కన్నా నివాళి

● నాగోతు శౌరయ్యకు పరామర్శ


నాగోతు శౌరయ్యను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కన్నా

నకరికల్లు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగోతు శౌరయ్య మాతృమూర్తి నాగోతు చిన్నమ్మ అంత్యక్రియల్లో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ గురువారం పాల్గొని నివాళి అర్పించారు. శౌరయ్యను వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. చిన్నమ్మ మృతిపై ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కన్నాతో పాటు నలబోతు వెంకటరావు, గోగినేని కోటేశ్వరరావు, దరువూరి నాగేశ్వరరావు, షేక్ అలీబాషా, సాగి శ్రీను, కరాలపాటి వలి, పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

బొల్లాపల్లిలో సమస్యలను పరిష్కరించాలి

● కలెక్టర్‌కు పెమ్మసాని నాగేశ్వరరావు వినతి


బొల్లాపల్లిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేషన్ డైరెక్టర్ పెమ్మసాని నాగేశ్వరరావు

బొల్లాపల్లి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉన్న పలు సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ కృతికా శుక్లాకు రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పెమ్మసాని నాగేశ్వరరావు విన్నవించారు. బుధవారం సాయంత్రం బొల్లాపల్లి రామాలయం వద్ద మండలంలో అడుగంటిన భూగర్భ జలాల పెంపొందించేందుకు ఏర్పాటుచేసిన సమావేశంలో కలెక్టర్ కృతికా శుక్లా పాల్గొన్నారు. ముందుగా కార్పొరేషన్ డైరెక్టర్ పెమ్మసాని నాగేశ్వరరావు కలెక్టర్‌కు పుష్ప గుచ్చం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రధానంగా బొల్లాపల్లి ఇరిగేషన్ చెరువును అభివృద్ధి చేసినట్లయితే వెయ్యి ఎకరాలు సాగులోకి వస్తుందన్నారు. మండలంలోని రైతుల పొలాలు 21ఏ నిషేధిత భూముల జాబితాలో ఉన్నాయని, వాటిని సవరించాలని, గుమ్మనంపాడు అగ్రహారం భూములను రీ సర్వే చేయించాలని కలెక్టర్ కృతికా శుక్లాకు వినతిపత్రం అందజేశారు. బొల్లాపల్లి చెరువు 250ఎకరాల్లో ఉందని, దీనిని అభివృద్ధి చేస్తే భూగర్భ జలాల పెరుగుదలతో పాటు పంటలకు అనువుగా ఉంటుందన్నారు. జిల్లా ఇరిగేషన్ శాఖ అధికారులతో పెమ్మసాని నాగేశ్వరరావు మైనర్ ఇరిగేషన్ చెరువును పరిశీలించారు. గ్రామంలో బస్ షెల్టర్ తదితర మౌలిక వసతులను కల్పించాలని కలెక్టర్ దృష్టికి ఆయన తీసుకువచ్చారు. సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు వెలిశెట్టి రంగయ్య, బొల్లాపల్లి కోటేశ్వరరావు, కందుల కోటేశ్వరరావు, షేక్ ఖాశిం, షేక్ సుభానీ, రావూరి నారాయణ, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో విచ్చలవిడిగా కల్తీ మద్యం అమ్మకాలు

● వైసీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ గోపిరెడ్డి ఆరోపణ

నరసరావుపేట రూరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విచ్చలవిడిగా నకిలీ మద్యం అమ్మకాలు జరుగుతున్నాయని పల్నాడు జిల్లా వైసీపీ కార్యనిర్వహక కార్యదర్శి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. గురువారం స్థానిక గుంటూరు రోడ్డులోని వైసీపీ కార్యాలయంలో శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 48 కోట్ల బాటిళ్ల కల్తీ మద్యం రాష్ట్రంలో పంపిణీ జరుగుతుందన్నారు. రాష్ట్రంలో 70వేల బెల్ట్ షాపులు పెట్టారన్నారు. రాష్ట్రంలో మంచినీళ్ల దొరకవేమో గాని మద్యం మాత్రం ఏరులై పారుతోందని ఆరోపించారు. జీఎస్టీ కేంద్ర ప్రభుత్వం తగ్గిస్తే మేమే తగ్గించామన్నట్టు సంబరాలు చేసుకోవడం ఈ ప్రభుత్వానికే చెల్లిందన్నారు. రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా పాలపర్తి వెంకటేశ్వర్లు నియమితులైన సందర్భంగా డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కౌన్సిలర్‌గా వార్డులో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేసి మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ స్థాయి నుంచి రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్ స్థాయికి ఎదిగిన పాలపర్తి వెంకటేశ్వర్లు అభినందనీయుడన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి సిబ్బంది పనితీరుపై డ్వామా పీడీ ఆగ్రహం

శావల్యాపురం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పనుల్లో అవినీతి, అక్రమాలకు అడ్డుకట్టవేసేందుకు ప్రభుత్వం ఈకేవైసీ విధానాన్ని చేపడితే, ఈకేవైసీ నమోదు చేయడంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఎందుకు జాప్యం చేస్తున్నారంటూ డ్వామా పీడీ సిద్ద లింగమూర్తి ఆగ్రహం వ్యక్తంచేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందితో గురువారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. డ్వామా పీడీ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 28మండలాలు ఉంటే ఈకేవైసీ నమోదులో శావల్యాపురం మండలం 26వ స్థానంలో ఉందన్నారు. మండలంలోని 15గ్రామ పంచాయతీల్లో మొత్తం 15729మంది శ్రామికులు ఉండగా ఇప్పటివరకు కేవలం 3813మందికి మాత్రమే ఈకేవైసీ పూర్తయిందన్నారు. మూడు రోజుల వ్యవధిలో నూరుశాతం ఈకేవైసీని పూర్తి చేయాల్సిందేనని సిబ్బందిని ఆదేశించారు. త్వరలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు చేయనున్నారని, ఉపాధి హామీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎంపీడీవో సీతారామయ్య, ఇన్‌చార్జి ఏపీవో ఆంజనేయరాజు పాల్గొన్నారు.